ఈనాడు ఆదివారం

21 సెప్టెంబరు 2025



బ్రహ్మాండ నాయకా... బహుపరాక్!

కల్యాణి ప్రియదర్శన్... హలో, చిత్రలహరి, రణరంగం చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైందీ మలయాళీ ముద్దుగుమ్మ. సూపర్ ఉమెన్ కథాంశంతో ఇటీవల విడుదలైన 'కొత్త లోక' సినిమాలోనూ తన నటనకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్కిటెక్చర్ చదివి మరీ సినిమాల్లోకి వచ్చిన ఈ భామ.. తన గురించి చెబుతోందిలా..

నా నుంచి వెళ్లే మొదటి ఫోన్ అతడికే!



మాది కేరళ అయినా నేను పుట్టి పెరిగిందంతా చెన్నైలోనే. నాన్న ప్రియదర్శన్ ప్రముఖ డైరెక్టర్, అమ్మ లిసా నటి కావడంతో చిన్నప్పుడు సెలవులొస్తే చాలు, వాళ్లతోపాటు షూటింగ్ సెట్లకు వెళ్లిపోయేదాన్ని. అలా అనుకోకుండానే సినిమాలపైన ఆసక్తి ఏర్పడింది. కానీ, నాన్నేమో చదువు తర్వాతే ఏదైనా

వాళ్ల మాట మీదే...

అనేవారు... అప్పుడే నాకు నేనుగా ఏది మంచో ఏది చెడో తెలుసుకోగలనని ఆయన ఉద్దేశం. దాంతో న్యూయార్క్ వెళ్లి ఆర్కిటెక్చర్ కోర్సు చేశా. అది పూర్తయ్యాక సినిమాల్లోకి వస్తానంటే- అమ్మానాన్నా నా ఇష్టాన్ని కాదనలేదు. అలా 2017లో తెలుగు సినిమా 'హలో'తో వెండితెరకు పరిచయమయ్యా. ఒకవేళ నటిగా నేను సక్సెస్ కాకపోయి ఉంటే.. సినీరంగంలోనే మరేదైనా విభాగంలో ఉండేదాన్ని.

ఎంతో కష్టపడ్డా...

ఇప్పటి వరకూ నేను చేసినవన్నీ సరదా పాత్రలే. కానీ, 'కొత్త లోక' కోసమే మొదటిసారి స్టంట్స్ చేశా. అందు కోసం ఆరునెలల పాటు శిక్షణ కూడా తీసుకున్నా.



బెస్ట్ ఫ్రెండ్.. దుల్కర్

ఐదేళ్ల క్రితం వచ్చిన మలయాళ చిత్రం 'వరణె అవశ్యముండ్'లో దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించా. అప్పటి నుంచి మేమిద్దరం క్లోజ్ ఫ్రెండ్స్ అయ్యాం. కష్టమొచ్చినా, సంతోషం కలిగినా, సలహా కావాలన్నా నా నుంచి వెళ్లే మొదటి ఫోన్ దుల్కర్‌కే. ఇద్దరం తరచూ కలుస్తుంటాం. చిన్నపిల్లల్లా అల్లరి చేస్తుంటాం.

చీరంటే ఇష్టం

ఈ కాలం అమ్మాయినే అయినా నాకు అమ్మలా చీర కట్టుకోవడం అంటే ఎంతిష్టమో. ప్రత్యేకంగా కొనుక్కోను గానీ అమ్మ చీరలన్నీ కట్టుకుంటా. అంతేకాదు, చీర కట్టుకున్నప్పుడు నన్ను నేను కౌగిలించుకున్నట్టు ఫీలవుతా.

అది ఊహించలేదు...

ఎప్పుడైనా 'ఐ హేట్ యూ' పదం వినిపిస్తే, నాకిప్పటికీ 'హలో' సినిమానే గుర్తొస్తుంటుంది. అందులోని ఆ డైలాగ్ అంతలా వైరల్ అవుతుందని అస్సలు ఊహించలేదు.

సీక్రెట్ అదే..

ఫిట్‌గా ఉండేందుకు రోజూ గంటన్నరసేపు వ్యాయామం చేస్తా. అరగంట గోల్ఫ్ ఆడతా. సినిమాల్లోకి వచ్చాక ధ్యానం చేయడం ప్రారంభించా.



అభిమాన తారలు

నా దృష్టిలో అందం అంటే ఆత్మవిశ్వాసం. అందుకే ముఖంలోనే కాదు.. మాట తీరులోనూ నడవడికలోనూ ఆత్మవిశ్వాసం ఉట్టి పడే సాయిపల్లవి, మంజూ వారియర్, శోభన, అలియాభట్‌లను అభిమానిస్తా.

ఆ కోరిక తీరింది

నేనూ, మోహన్‌లాల్ అంకుల్ కుమారుడు ప్రణవ్ చిన్ననాటి మిత్రులం. చిన్నప్పటి నుంచీ నాకో కోరిక ఉండేది.. స్నేహితులమంతా కలిసి ఓ సినిమా తీయాలని! అది నేనూ, ప్రణవ్ హీరోహీరోయిన్లుగా నటించిన 'హృదయం'తో నెరవేరింది. ఈ చిత్రానికి డైరెక్టర్, సహనిర్మాత కూడా మా మిత్రులే.



అనాథాశ్రమంలో ఉన్నాం

అమ్మానాన్నలు చిన్నతనంలోనే మాకు జీవితం విలువ తెలియజెప్పాలనుకున్నారు. అందుకే నన్నూ, తమ్ముడు సిద్ధార్థ్‌నూ వారం రోజులపాటు వియత్నాంలోని ఓ అనాథాశ్రమంలో ఉంచారు. వాళ్లు తినే ఆహారమే తిన్నాం. నేలపైనే నిద్రపోయాం. ఆ అనుభవం మాకెన్నో పాఠాలు నేర్పించింది.

తీరిక వేళల్లో...

ఖాళీ దొరికితే కూర్గ్‌లోని మా పూర్వీకుల ఇంటికి వెళ్లిపోతుంటా. అక్కడి కాఫీ తోటల్లో తిరుగుతూ హాయిగా గడిపేస్తా. విదేశాల్లోనైతే మళ్లీ మళ్లీ వెళ్లాలనిపించే ప్రదేశం సియోల్.

తినేస్తుంటా...

నేను అస్సలు నోరు కట్టేసుకోలేను. అరటి పండు పాయసం అంటే ఎంతిష్టమో. అలానే ఫ్రెండ్స్‌తో కలిసి బిర్యానీ, పానీపూరీ తింటుంటా.

లోపల

మంచిమాట

సంపాదించిన వ్యక్తి ఎన్నడూ వృథా చేయడు, వృథా చేసే వ్యక్తి ఎప్పుడూ సంపాదించలేడు.

ఇదీ అంతే...

భార్య: నాతో గొడవపడినప్పుడల్లా అందులోకి మా అమ్మానాన్నల్ని లాగుతారెందుకు..?

భర్త: మనం ఏదైనా వస్తువు కొన్నప్పుడు దాని వల్ల ఇబ్బంది కలిగితే దాంతోపాటు కంపెనీవాళ్లనూ కలిపి తిడతాం కదా, ఇదీ అంతే...!

తెలివితక్కువ

వెంగళప్ప: బయటకు వెళ్లి సూర్యుడు వచ్చాడో లేదో చూసిరాపో!

భార్య: లేదండీ, ఇంకా చీకటిగానే ఉంది.

వెంగళప్ప: తెలివితక్కువ పెళ్లాంతో ఇలానే ఉంటుంది. ఖర్మ... చీకట్లో ఎలా కనబడతాడు, టార్చ్‌లైట్ వేసుకుని చూడు.

మన సామెత

తల్లికి గంజి పోయనివాడు పినతల్లికి చీర పెడతాడట!

లివర్ సిర్రోసిస్: పెరుగుతున్న ఆరోగ్య సమస్య - తీవ్ర పరిణామాలు

లివర్-మన శరీరానికి హృదయం లాంటిదే. లివర్ బరువు పెద్దవారిలో 1.2 - 1.5 కిలోల మధ్య ఉంటుంది. ఆహారం జీర్ణం చేయడం, పోషకాలు గ్రహించడం, శరీరానికి కావలసిన జీవక్రియ సంతులనాన్ని (మెటబోలిక్ బ్యాలెన్స్‌ని) కాపాడటం, విష పదార్థాలను బయటకు పంపడం, ఇవన్నీ మనకు తెలిసిన పనులు మాత్రమే. కానీ నిజానికి, లివర్ 500 కంటే ఎక్కువే ముఖ్యమైన పనులు చేస్తుంది. జీవితం కొనసాగడానికి లివర్ తప్పనిసరి.

ఎలా వస్తుంది సిర్రోసిస్?

లివర్‌కి ఎప్పటికప్పుడు నష్టం కలిగితే అది తనంతట తానే మాన్పుకుంటుంది. గాయాల (Scar Tissue) రూపంలో మళ్లీ మానుకోవడానికి ప్రయత్నిస్తుంది. Hepatitis B, C లాంటి దీర్ఘకాలిక వైరల్ ఇన్ఫెక్షన్లు, ఎక్కువగా మద్యం సేవించడం, స్థూలకాయం, మధుమేహం వల్ల వచ్చే ఫ్యాటీ లివర్, ఇవన్నీ లివర్ మీద మళ్లీ మళ్లీ దెబ్బలు కొడతాయి. ఫలితం లివర్ గట్టి పడుతూ, మెల్లగా సిర్రోసిస్‌కి దారి తీస్తుంది.

సిర్రోసిస్ అంటే ఏమిటి? లక్షణాలు ఏమిటి?

సిర్రోసిస్ అనే కండిషన్‌లో, ఆరోగ్యకరమైన లివర్ టిష్యూ బదులు గట్టి, దృఢమైన స్కార్ / ఫైబ్రస్ టిష్యూ వస్తుంది. అప్పుడు లివర్ తన ముఖ్యమైన పనులు చేయలేకపోతుంది. ఇది మొదటి దశలో నిశ్శబ్దంగానే మొదలవుతుంది.

కానీ కాలక్రమంలో కనిపించే లక్షణాలు: తేలికగా అలసిపోవడం, అనుకోకుండా బరువు తగ్గిపోవడం, జాండిస్ (చర్మం, కళ్లలో పసుపు రంగు), పొత్తికడుపు ఉబ్బరంగా మారడం, మెదడులో విష పదార్థాలు పేరుకుపోవడం వల్ల మూడ్ మార్పులు, మతిమరుపు (hepatic encephalopathy) లాంటి లక్షణాలు. కొన్ని లక్షణాలు జెండర్ స్పెసిఫిక్‌గా కూడా ప్రత్యేక లక్షణాలు కూడా ఉంటాయి:

పురుషుల్లో: లైంగిక ఆసక్తి తగ్గిపోవడం, ఛాతి ఎదుగుదల (gynecomastia)

మహిళల్లో రుతు చక్రంలో లోపాలు

తీవ్రమైన సిర్రోసిస్ దశలో, రోగులు రక్తం వాంతి చేయడం లేదా నల్లటి, గట్టిపడిన మల విసర్జన కనిపించవచ్చు. ఇవి అంతర్గత రక్తస్రావానికి సంకేతాలు.

చికిత్స లేకుంటే ఎదురయ్యే ప్రమాదాలు: సిర్రోసిస్‌కి చికిత్స చేయకుండా వదిలేస్తే, ఇది ప్రాణాపాయ స్థితులకు దారి తీస్తుంది:

Esophageal varices: అన్నవాహికలో వాపు వచ్చి, నరాలు పగిలి రక్తస్రావం

Ascites: పొత్తికడుపులో ద్రవం పేరుకుపోవడం

కడుపులో ఇన్ఫెక్షన్లు

Hepatic encephalopathy: అయోమయం, మూడ్‌లో మార్పులు, తీవ్రమైన దశలో కోమా

Hepatorenal syndrome: కాలేయ వ్యాధి కారణంగా కిడ్నీలలో రక్తప్రసరణ తగ్గి, అవి సరిగ్గా ఫిల్టర్ చేయలేకపోవడం జరుగుతుంది.

లివర్ క్యాన్సర్: ముఖ్యంగా హెపటైటిస్ వల్ల వచ్చిన సిర్రోసిస్ రోగుల్లో ఎక్కువగా కనిపిస్తుంది

చికిత్స నివారణ: సిర్రోసిస్‌ని పూర్తిగా తిప్పికొట్టలేకపోయినప్పటికీ, ముందుగానే గుర్తించి చికిత్స చేస్తే మరింత నష్టాన్ని అడ్డుకోవచ్చు. మద్యపానం పూర్తిగా మానేయాలి. హెపటైటిస్ వ్యాక్సిన్ తప్పని సరిగా తీసుకోవాలి. ఉప్పు వాడకం తగ్గించాలి. వైద్యుల పర్యవేక్షణలో ఉండాలి, మందులు సరిగ్గా వాడాలి. కాలానుగుణంగా పరీక్షలు చేయించుకోవాలి. సిర్రోసిస్ తీవ్రమైన సందర్భాల్లో లివర్ ట్రాన్స్‌ప్లాంట్ మాత్రమే ఉత్తమ పరిష్కారం. ఈ రోజుల్లో భారత దేశంలో కూడా లివర్ ట్రాన్స్‌ప్లాంట్ విజయ శాతం ప్రపంచ ప్రమాణాలతో సమానంగా ఉంది. శస్త్రచికిత్స తర్వాత మొదటి ఏడాదిలో 85-90% రోగులు సజీవంగా ఉంటున్నారు.

చివరిగా ఒక్క మాట: లివర్ని కాపాడుకోవడం అంటే జీవితాన్ని కాపాడుకోవడమే. ముందే పరీక్షలు, జాగ్రత్తలు తీసుకుంటే సిర్రోసిస్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు.



డా॥ **రాజేష్ చంద్ర**
కన్సల్టెంట్ - మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, మణిపాల్ హాస్పిటల్, విజయవాడ.

వృద్ధులు...

ఎప్పుడైనా రావొచ్చు, భోంచేసి వెళ్ళొచ్చు!





వృద్ధాప్యం ఎంతోమందికి శాపం. వేళకు ఆహారం అందక, పలకరించేవాళ్లు కనిపించక, ఏ కాలక్షేపమూ లేక... ఇంకెన్నాళ్లు ఈ బాధలు పడాలో అనుకుంటూ లోలోన కుమిలిపోతుంటారు. అలాంటివారికి తాము ఉన్నామని భరోసానిస్తూ... వేళకు భోజనం అందించడం నుంచి వసతి వరకూ అన్ని అవసరాలూ తీరుస్తుంది కృష్ణ సదన్.

పచ్చని చెట్ల మధ్య... ఆహ్లాదకరమైన వాతావరణంలో చక్కని కుటీరం తరహాలో కనిపిస్తుంది కృష్ణసదన్. హైదరాబాద్‌లోని కొంపల్లిలో ఉండే ఈ సేవాశ్రమంలో వృద్ధులు కావాల్సినప్పుడు వచ్చి వేళకు భోజనం చేసి... హాయిగా సేద తీరొచ్చు. 'వయసైపోయిన తమని పలకరించేవాళ్లు లేక చనిపోయేందుకు ప్రభుత్వ అనుమతి కోరిందో జంట. వృద్ధాప్యంలోని ఒంటరితనాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడో నటుడు... ఈ విషయాలు పత్రికల్లో వచ్చాయి కాబట్టి అందరికీ తెలిశాయి. మరి, మిగిలినవాళ్ల పరిస్థితి? కడుపునిండా తిండిలేక, కాసేపైనా కబుర్లు చెప్పేవాళ్లు లేక ఒంటరితనంతో బాధపడుతూ రోజులు వెళ్లదీసేవారు ఎందరో. అలాంటి వారి బాధలు చూశాకే ఈ కృష్ణసదన్‌ను ఏర్పాటు చేశా' అంటారు దీని వ్యవస్థాపకులు కృష్ణమోహన్. ఆయన పుట్టిపెరిగింది హైదరాబాద్‌లోనే. సోషల్ వర్క్‌లో పట్టా అందుకున్న ఆయన... దేశ విదేశాల్లో ఎన్నో వర్క్‌షాప్‌లను నిర్వహించారు. పాష్ చట్టంపైన కార్పొరేట్ సంస్థల్లో అవగాహనా తరగతులూ నిర్వహిస్తారు.

హాయిగా ఉండొచ్చు

వృద్ధులు ఎప్పుడు వెళ్లినా... కృష్ణసదన్ ద్వారాలు తెరిచే ఉంటాయి. వాళ్లు ఇక్కడ తోటివారితో కబుర్లు చెబుతూ రోజంతా కాలక్షేపం చేయొచ్చు. అలాగే, కొందరి పిల్లలు ఉద్యోగాల పేరుతో వేరే ప్రాంతాలకు వెళ్లిపోవడంతో ఆ తల్లిదండ్రులు ఒంటరివాళ్లవుతారు. వాళ్లకేమో పొద్దున లేచిన దగ్గర్నుంచీ బోలెడు అవసరాలు ఉంటాయి. అలాంటివారికి సహాయకుల్ని చూపించడం, దగ్గరుండి ఫిజియోథెరపీ చేయించడం, వైద్యుల దగ్గరకు తీసుకెళ్లడం... ఇలా ఏది అడిగినా కాదనకుండా సాయం చేస్తుందీ సంస్థ. 'మా సేవల్లో ఒకటి కౌన్సెలింగ్.... పెద్దవాళ్లకూ మిగిలిన కుటుంబసభ్యులకూ మధ్య ఉన్న సమస్యల్ని కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరిస్తాం. అలాగే ట్రాన్సిట్ హోమ్... అంటే, ఇక్కడ కొంతమంది శాశ్వతంగా ఆశ్రయం పొందుతుంటారు. వాళ్లు కాకుండా ఎవరైనా మా ఆశ్రమానికి వచ్చి, ఒకటి రెండు రోజులు ఉండి వెళ్లొచ్చు. అలా వచ్చేవాళ్లను వ్యక్తిగత వివరాలు తప్ప ఇంకెలాంటి ప్రశ్నలూ అడగం. ఉదాహరణకు ఇంట్లో చిన్న సమస్య తలెత్తి రెండు రోజులు ఎక్కడైనా ఉండాలనుకుంటే మా దగ్గరకు రావొచ్చు. అలాగే ఇంట్లో పార్టీ ఉంది, ఆ హడావుడి పెద్దవాళ్లకు నచ్చకపోవచ్చు. అలాంటివారూ వారాంతాల్లో వచ్చి వెళ్తుంటారు. మొదటిసారి వచ్చేవాళ్లు మాత్రం రిఫరెన్స్ కాంటాక్ట్‌ని ఇవ్వాల్సి ఉంటుంది. వాళ్లకు ఏదైనా అనుకోని అనారోగ్యం వస్తే... సొంతవాళ్లకు ఫోన్ చేయాలి కాబట్టి ఆ వివరాలు తీసుకుంటాం. అలా రోజుకు ఇద్దరు ముగ్గురు చొప్పున నెలకు కనీసం రెండువందల మంది మా దగ్గరకు వస్తారు. కొందరు పెద్దవాళ్లు కేవలం భోజనం కోసమే ఇక్కడకు వస్తుంటారు. మేం వాళ్లనుంచీ ఒక్క రూపాయి కూడా తీసుకోం. అలా వచ్చేవాళ్లందరికోసం ఇక్కడ చిన్న ఆలయం, గోశాల, టీవీ, కామన్ డైనింగ్‌హాల్, కిచెన్, గ్రంథాలయం అన్నీ ఉంటాయి...' అంటూ వివరిస్తారు కృష్ణమోహన్. ఇక, ఇక్కడ ఉదయం తొమ్మిది గంటలకు పప్పు, కూర, రోటిపచ్చడి, అన్నం, పెరుగుతో కడుపునిండా భోజనం పెడతారు. మధ్యాహ్నం ఒంటి గంటకు టిఫిన్, సాయంత్రం మళ్లీ అన్నం, మజ్జిగ, కూరతో భోజనం ఉంటుంది. రెండు పూటలా కాఫీ, టీలు మామూలే. ఆ వంటకాలన్నీ పెద్దవాళ్ల ఆరోగ్య పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకుని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్‌కు చెందిన పోషకాహార నిపుణుల సలహాతోనే నిర్ణయిస్తారు.

ప్రాజెక్టు యశోద

కొందరు పెద్దవాళ్లు ఇంట్లోనే ఉంటున్నా



ఆర్థిక పరిస్థితుల కారణంగా పిల్లలకు భారమవుతుంటారు. అలాంటివారిని ఆదుకునేందుకు ప్రాజెక్ట్ యశోద పేరుతో ప్రతినెలా నలభై మందికి నిత్యావసరాలను అందిస్తుందీ సంస్థ. అందులో పదికిలోల బియ్యం, రెండు కిలోల కందిపప్పుతోపాటు నూనె, చింతపండు, సబ్బులు, టీపొడి, ఎండుమిర్చి.. ఇలా అన్నీ ఉంటాయి. ఇది కాకుండా... పిల్లలూ, యువతలోనూ పెద్దవాళ్ల పట్ల గౌరవాన్ని పెంచేందుకు ఓరియంటేషన్ క్లాసుల్నీ నిర్వహిస్తుంది. ఇందుకోసం దాదాపు ఇరవై విద్యాసంస్థలతో అనుసంధానమైందీ సంస్థ. 'మేం ఎవరి నుంచీ డబ్బు రూపంలో సాయం తీసుకోం. వాళ్లు ఇవ్వాలనుకున్న డబ్బుతో ఏదో ఒకటి కొనివ్వమంటూ పారదర్శకంగా వ్యవహరిస్తాం. వృద్ధులెవరైనా చివరిదశలో ఆత్మన్యూనతా భావంతో కుంగిపోకూడదూ, ఆకలితో చనిపోకూడదనే ఆశయంతోనే దీన్ని ప్రారంభించా. మాకు కృష్ణసదన్ ఉందనే భరోసాను వీలైనంతమందిలో కలిగించడమే నా లక్ష్యం...' అంటారు కృష్ణమోహన్. ★



వీళ్లిద్దరూ... అటు పేదరికం, ఇటు వైకల్యం రెండూ ఉన్నా వాటిని దీటుగా ఎదుర్కొన్న ధీరులు. క్రీడలనే తెడ్డుతో బతుకు పడవని విజయతీరాలకి చేర్చగలిగారు. తెలుగు రాష్ట్రాల నుంచి జాతీయ అంతర్జాతీయ పోటీల్లో చెరగని ముద్ర వేస్తున్నారు.

విధికి సవాలు విసిరారు!

జాతీయ జట్టుకి వైస్ కెప్టెన్!



కావేరిపాక్కం గణేశ్‌కి పుట్టుకతోనే ఎడమకాలు లేదు. చిత్తూరు హాస్టల్‌లో చదివేటప్పుడు తోటివాళ్లందరూ క్రికెట్ ఆడటం చూసి తానూ బ్యాట్‌పట్టాడు. ఎనిమిదో తరగతిలో జరిగిన ఇంటర్ స్కూల్ కాంపిటీషన్‌లో- ఎక్స్‌ట్రా ప్లేయర్‌గా వెళ్లి... నాటౌట్‌గా నిలవడం అతనికి జిల్లా వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ తర్వాతే అటు వీల్‌ఛెయిర్ క్రికెట్‌లోనూ అది లేకుండా ఆడే దివ్యాంగుల క్రికెట్‌లోనూ జాతీయ స్థాయికెళ్లాడు. మరోవైపు జేఈఈ రాసి తిరుచ్చిరాపల్లి ఎన్‌ఐటీలో సీటు సాధించాడు. అక్కడే అతణ్ణి దివ్యాంగ్ క్రికెట్ కంట్రోల్ బోర్డ్ ఆఫ్ ఇండియా (డీసీసీబీఐ) వారు ఎంపిక చేసి అంతర్జాతీయ పోటీకి పంపించారు. బంగ్లాదేశ్, నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండర్‌గా మెరిశాడు. ఈలోపు ఇంట్లో ఆర్థిక కష్టాల కారణంగా వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో ఉద్యోగిగా చేరాడు. డీసీసీబీఐ తరపున జాతీయ వికలాంగుల క్రికెట్ జట్టుకి ఆడుతూనే అథ్లెటిక్స్‌లోనూ రాణిస్తున్నాడు గణేశ్. ఈ మధ్యే జరిగిన జాతీయస్థాయి క్రీడా పోటీల్లో షార్ట్‌పుట్‌లో స్వర్ణం, జావెలిన్ త్రోలో రజత పతకాలు అందుకున్నాడు.

సైక్లింగ్‌లో ఒకే ఒక్కడు...

షేక్ అర్షద్‌ది నంద్యాల. తండ్రి వెండిపనులు చేసే కార్మికుడు. ఐదో తరగతి నుంచీ తైక్వాండో నేర్చుకోవడం మొదలుపెట్టాడు. రెండేళ్లలోనే రాష్ట్ర స్థాయి ఛాంపియన్ అయ్యాడు. 2012లో నంద్యాల నుంచి వెలిగోడులోని బంధువుల ఇంటికి షేర్ ఆటోలో వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో... అతని ఎడమకాలు- మోకాలి నుంచి తీసేయాల్సి వచ్చింది. ఆపరేషన్ థియేటర్‌లో అనస్థటిస్టుగా వచ్చిన డాక్టర్ రవికిషన్ అతణ్ణి గుర్తుపట్టాడు... ఇదివరకు ఆయన చేతుల మీదుగానే ఎన్నో బహుమతులు అందుకున్నాడట అర్షద్! ఆయనే అర్షద్‌కు ఆర్చరీ పోటీల్లో శిక్షణ ఇప్పించాడు. విజయవాడలో శిక్షణకు చేరాక జాతీయస్థాయిలో టాప్-5లో నిలిచాడు. కానీ ఎంత సాధించినా... ఆర్చరీకి కావాల్సిన విల్లంబులకయ్యే ఖర్చెక్కువ. అవి భరించలేక నంద్యాలకొచ్చేశాడు అర్షద్. ఓ ఆసుపత్రిలో రిసెప్షనిస్టుగా చేరాడు. ఉద్యోగానికి వెళ్లడం కోసం ఒంటికాలితో సైకిల్ తొక్కడం నేర్చుకున్నాడు. అప్పుడే హైదరాబాద్‌లోని ఆదిత్య మెహతా ఫౌండేషన్ వాళ్లు వికలాంగులకి సైక్లింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తారని తెలిసి అందులో చేరాడు అర్షద్. గత ఏడాది పారాలింపిక్స్‌కి ఎంపికై... సైక్లింగ్ విభాగంలో ఆ పోటీల్లో పాల్గొన్న తొలి భారతీయ క్రీడాకారుడిగా చరిత్ర సృష్టించడమేకాక ప్రపంచ ర్యాంకింగ్‌లో నాలుగో స్థానంలో ఉన్నాడు!



– వీర గంగాధర శర్మ, ఈనాడు డిజిటల్, తిరుపతి

షాపింగ్

బొమ్మ మెరుస్తుంది!



ఇదో చిత్రమైన డ్రాయింగ్ బోర్డు. ఇందులో పిల్లలు ఏదైనా రాయొచ్చూ గీయొచ్చు. వాళ్లలా రాయడానికీ గీయడానికీ ఈ బోర్డుతోపాటే నాలుగు రంగుల్లో ప్రత్యేకమైన నియాన్ పెన్నులను ఇస్తారు. ఇది గాజు తెరతో వస్తున్నందువల్ల పిల్లలకిష్టమైన బొమ్మల్ని 'ట్రేస్' చేయొచ్చు. అంటే పిల్లలు కోరుకున్న బొమ్మని బోర్డు అడుగు భాగాన పెట్టి... దానిపైనే గీస్తూ చిత్రాన్ని సృష్టించొచ్చన్నమాట! ఇలా రాయడం గీయడం పూర్తయ్యాక... దీని పక్కనున్న మీటని నొక్కితే చాలు మీరు సృష్టించిన ఆకారానికి రంగురంగుల మెరుపుల హంగులొచ్చేస్తాయి. 3డీ ఎఫెక్ట్‌తో అలరిస్తాయి. ఇలా 36 రకాలుగా మీ బొమ్మని మెరిపించవచ్చన్నదే... ఈ 'గ్లో బోర్డు' ప్రత్యేకత.





బ్యాటరీతో వాటర్ బాటిల్!



ఈ వాటర్ బాటిల్‌ని అటు కెటిల్‌గానూ ఇటు ఫ్లాస్క్‌గానూ ఉపయోగించుకోవచ్చు. ఇందులో ఉన్న బ్యాటరీకి రెండుమూడు రోజులకోసారి ఛార్జ్ పెడితే సరిపోతుంది. పోర్టబుల్ ఎలక్ట్రిక్ కెటిల్- ట్రావెల్ బాటిల్ పేరుతో వస్తున్న దీంతో నీళ్లనే కాదు కాఫీ టీ పాలూ... ఇలా దేన్నయినా వేడిచేసుకోవచ్చు. అందుకు తగ్గట్టే 35 డిగ్రీల నుంచి 100 డిగ్రీల మధ్య వివిధ ఆప్షన్‌లని ఎంచుకోవచ్చు. మళ్లీ మళ్లీ వేడిచేసి బ్యాటరీ పవర్ ఖర్చుచేయాల్సిన అవసరం లేకుండా... ఇది ఫ్లాస్క్‌లానూ ఉపయోగపడుతుంది. ఒక్కసారి వేడిచేస్తే చాలు... రోజంతా హాట్‌హాట్‌గా తాగుతూ ఉండొచ్చు.

వైఫైకి పవర్ బ్యాంకు

ఇంటర్నెట్‌లేనిదే అటు వినోదం, ఇటు ఆఫీసు విధులూ కొనసాగలేని పరిస్థితి. సంప్రదాయ ఇన్వర్టర్‌లు ఒక ఫ్యాను, రెండు లైట్లు, వీలైతే టీవీ... ఇలా తప్పనిసరి అవసరాలకే పరిమితం అవుతుంటాయి కాబట్టి వైఫై రూటర్‌లని అవి ఆదుకోలేవు. దాంతో టీవీకి కరెంటున్నా సరే... వినోదాలకి మూలమైన వైఫై రూటర్‌కి విద్యుత్తు అందదు. ల్యాప్‌టాప్‌లో పనులు చేయడానికి కావాల్సినంత డేటా స్పీడూ సరిపోదు. ఈ సమస్య నివారణకే వైఫై రూటర్‌ల కోసం ప్రత్యేక పవర్‌బ్యాంకులు వస్తున్నాయి. వాటిని జస్ట్ కనెక్ట్‌చేసి వైఫైని నిక్షేపంగా ఉపయోగించుకోవచ్చు. 'వైఫై రూటర్ యూపీఎస్' అని వీటిని పేరుకే అంటున్నా... టీవీ సెట్‌టాప్ బాక్స్, సీసీ టీవీ కెమెరాలకి కూడా వీటిని వాడుకోవచ్చు.



గాలి ఇట్టే నింపేస్తుంది!



నేడు స్కూటర్లూ బైకులూలేని కుటుంబాలు అరుదు. కారు కూడా కనీసావసరం అయిపోయింది. వీటికి పెట్రోలు ఎంత అవసరమో వాటి టైర్లలో గాలి నింపడమూ అంతే అవసరం. ఇందుకోసం ప్రతిసారీ పెట్రోల్ బంకుకి వెళ్లాల్సిన అవసరం లేకుండా, బంకుల్లేని చోట ఇబ్బంది పడకుండా ఉన్నచోటే గాలి నింపేందుకు ఉపయోగపడే బుల్లి పరికరం ఇది. 'ఎయ్‌గో మినీ ఇన్‌ఫ్లేటర్' అన్నది దీని పేరు. ఇట్టే అరచేతిలో ఇమిడిపోతుంది. అయినా 150 పీఎస్ఐ ప్రెజర్‌తో పనిచేస్తుంది. దానర్థం పెద్ద టైర్లున్న కార్లకీ కొన్ని క్షణాల్లో గాలి నింపేస్తుందని! మోటార్‌బైకులూ సైకిళ్ల టైర్లూ, వాలీబాల్ బంతులూ తదితరాలకి కూడా దీన్ని చక్కగా వాడుకోవచ్చు.



తాళానికీ ఫింగర్ ప్రింట్ వచ్చింది..!

నేటి ఇళ్లు హైటెక్‌గా మారుతున్నాయి. ఫింగర్ ప్రింట్ యాక్సెస్‌ల్లాంటివి ఇప్పుడు ఇంటి డోర్‌లకే వాడుతున్నారు. కాకపోతే, ఇప్పటిదాకా దీన్ని 'ఆటోమెటిక్ డోర్ లాక్స్'కి మాత్రమే ఉపయోగిస్తూ వస్తున్నారు. అలాకాకుండా ఆ సాంకేతికతని మామూలు తలుపు గడియలకి ఉపయోగించేలా సరికొత్త తాళం ఒకటి మార్కెట్‌లో హల్‌చల్ చేస్తోంది. 'ఎల్వీఫ్లో స్మార్ట్ ప్యాడ్‌లాక్' పేరుతో ఉన్న ఈ తాళాన్ని ఇంటి గడియలకే కాకుండా... బైకులూ, పెట్టెలూ, హాస్టల్ స్టోరేజ్‌లకీ వాడుకోవచ్చు. పదిమంది ఫింగర్ ప్రింట్‌లని ఇందులో నమోదుచేయొచ్చు. ఒక్కోసారి వేళ్లు తడిస్తేనో గాయపడితేనో మన ఫింగర్ ప్రింట్ పనిచేయదు... అలాంటప్పుడు దీనికి అనుసంధానమైన యాప్ ద్వారా టెంపరరీ యాక్సెస్‌నీ పొందొచ్చు. అవసరాన్నిబట్టి కొత్త వ్యక్తులకీ ఈ యాక్సెస్ ఇవ్వొచ్చు!







బ్రహ్మాండ నాయకా... బహుపరాక్!

కొత్త అవతారం ఎత్తనే లేదు. గరుడ వాహనం ఎక్కనే లేదు. చక్రాయుధం పట్టనే లేదు. అయితేనేం... ప్రకృతిని పురమాయించో, భక్తులకు ప్రేరణనిచ్చో... ముష్కర మూకల నుంచి తిరుమల ఆలయాన్నీ, అనంత సంపదల్నీ రక్షించుకున్నాడు శ్రీవేంకటేశ్వరుడు. కలియుగంలో... దుష్టశిక్షణకు పరమాత్మ ఎంచుకున్న పరోక్ష వ్యూహమిది. శ్రీవారి బ్రహ్మోత్సవాల (సెప్టెంబరు 24 నుంచి) సందర్భంగా చరిత్ర, ఐతిహ్యం, విశ్వాసాలూ కలగలిసిన ఆ విజయ గాథల ప్రస్తావన...

శ్రీనివాసుడు... వెండి వాకిలివాడు, బంగారు గోపురాలవాడు, నవరత్న హారాలవాడు, వజ్ర కిరీటమువాడు! స్వామి నివాసం కలియుగ వైకుంఠమైన తిరుమల. అతని ఇల్లాలు శ్రీమహాలక్ష్మి సకల సంపదల పట్టాదారు. ఆ ఆగర్భ శ్రీమంతుడు ఆనందనిలయ గర్భాలయంలో కొలువుదీరి... నిత్య వైభోగాల నడుమ నానా దిక్కుల నరుల మొరలన్నీ ఆలకిస్తూ ఉంటాడు. ముక్కుపిండి మరీ ఆపద మొక్కులు వసూలు చేస్తుంటాడు. తొండమానుడు సమర్పించిన మణిమాణిక్యాలూ, పల్లవరాణి సామవై దఖలుపరిచిన దివ్యాభరణాలూ, విజయనగర ప్రభువులు నివేదించిన విలువైన కానుకలూ... వెలకట్టలేనన్ని! మహామహా సార్వభౌములు సైతం సమర విజయాల తర్వాత శరణుశరణని శ్రీనివాస చక్రవర్తిని దర్శించుకున్నారు. 'నాహం కర్తా... హరిః కర్తా'... అంటూ సాధించిన గెలుపులోనే కాదు, పోగేసిన సంపదలోనూ బ్రహ్మకడిగిన పాదాలకు భాగం ఇచ్చారు. ఓ దశకు వచ్చేసరికి ఆ ధన-కనక-వస్తు-వాహన రాశి ఎనిమిదో కొండలా పేరుకుపోయింది.

సమాంతరంగా... కాలమాన పరిస్థితుల్లోనూ ఎన్నో మార్పులు. గొప్పగొప్ప సామ్రాజ్యాలు కుప్పకూలిపోయాయి. ముస్లిం పాలకుల ప్రాబల్యం పెరిగింది. ఫ్రెంచ్, డచ్, పోర్చుగీస్, బ్రిటిష్... వ్యాపారులు వాణిజ్యాల పేరుతో దేశంలోని కీలక స్థావరాల్లో గుడారాలు వేసుకున్నారు. బలవంతులకు కప్పాలు కడుతూ, బలహీనుల రక్తమాంసాలు పీలుస్తూ రోజులు నెట్టుకొస్తున్న స్థానిక పాలకుల సంఖ్యా తక్కువేం కాదు. అందరి చూపులూ తిరుమల సంపదలపైనే. అయినా మత్స్య, కూర్మ, వరాహాది అవతారాల్లో... కుంగిన భూమిని పట్టి నిలబెట్టినవాడూ, అసురులపాలైన వేదాల్ని అంతేవేగంగా వెనక్కి తెచ్చినవాడూ, ముల్లోకాలకూ అనేకమంది అసురుల పీడలు విరగడ చేసినవాడూ... ఆ పిపీలకాల పీచమణచలేడా? ఆదిమధ్యాంత రహితుడికి అదెంత పని! కానీ, శ్రీవేంకటేశ్వరుడు ఈసారి వ్యూహం మార్చాడు. చక్రాయుధానికి పనిచెప్పలేదు. గరుడవాహనాన్ని అధిరోహించలేదు. కలియుగ పరిస్థితులకు తగినట్టు, మహా లౌక్యంగా వ్యవహరించాడు.

★ ★ ★


మార్టిం అఫోన్సో డిసౌజా... పోర్చుగీసు గవర్నరు. నిలువెత్తు అహంకారి. అప్పటికే, ఏడుకొండలవాడి సంపదల గురించి కథలు కథలుగా విన్నాడు. మూలవిరాట్టుకు అలంకరించే వజ్ర కిరీటం, నవరత్నఖచిత శంఖచక్రాలు, స్వర్ణ కర్ణపత్రాలు, మకరకుండలాలు, సూర్యకటారి, నాగాభరణం ... ఇంకా, మాళిగల్లోని రాశులకొద్దీ వెండి-బంగారాలు... ఆ వివరాలు చదువుతున్నప్పుడే అతని మనసులో దోపిడీ ప్రణాళిక సిద్ధమైపోయింది. అందులోనూ, విజయనగర అళియ రామరాయలు అంతర్గత కుమ్ములాటలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రోజులవి. అదే సరైన సమయమని భావించాడు మార్టిం అఫోన్సో. నౌకాదళానికి తోడుగా రెండున్నర వేల కాల్బలం, రెండొందల అశ్వబలం సిద్ధం చేసుకున్నాడు. గోవా నుంచి పులికాట్ వరకూ సముద్ర మార్గంలో వెళ్లి... అక్కడి నుంచి కాల్బలంతో తిరుమలకు చేరుకోవాలన్నది పన్నాగం. అంతలోనే, అఫోన్సోను అనారోగ్యాలు చుట్టుముట్టాయి. మనసులో తెలియని అలజడి. నిద్రలో ఒకటే పీడకలలు! ఉలిక్కిపడేవాడు. ఉన్మాదిలా ప్రవర్తించేవాడు. ఇలాంటి పరిస్థితుల్లో అంతదూరం వెళ్లడం సరికాదని ఆత్మీయులు చెప్పి చూశారు. అయినా అతను వినలేదు. 1543 ఆగస్టు చివరి వారంలో దాడికి బయల్దేరాడు. నౌకలు నడిదారికి చేరగానే, వాతావరణంలో అనూహ్యమైన మార్పులు. సముద్ర తుపాను ఉక్కిరిబిక్కిరి చేసింది. అపార నష్టం సంభవించింది. కాల్బలం, అశ్వబలం కూడా మార్గమధ్యంలో విరేచనాలూ, విష జ్వరాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్టు వర్తమానం అందింది. వెంటనే, అత్యవసర సమావేశం ఏర్పాటు చేశాడు. ప్రతికూలతల గురించి వివరించాడు. '...ఇదీ పరిస్థితి. ఏం చేద్దాం చెప్పండి?' అని సహచరుల్ని అడిగాడు. 'తిరిగి వెళ్లిపోదాం. ఎందుకో మన ప్రయత్నం సరికాదనిపిస్తోంది' అని నిరాశగా జవాబిచ్చారు ముఖ్య అనుచరులు. అప్పటికే డిసౌజాను పిరికితనం ఆవహించింది. ఓటమి భయం వేధించేది. మొత్తానికి, పోర్చుగీసు ఓడలు వెనక్కి మళ్లక తప్పలేదు. ఏడుకొండల్ని ఏమీ చేయలేక పోయామనే ఉక్రోషంతో ఆ మూకలు దగ్గర్లోని ఆలయాలను దోచుకున్నాయి. ఆ కాసుల మూటలతో గోవాకు వెళ్లిపోయాయి. ఇంకెప్పుడూ తిరుమల మీదికి దండెత్తే సాహసం చేయలేదు డిసౌజా.

కరుణాసింధూ, పాలసంద్రపు పౌరుడూ, సముద్రరాజ తనయ ప్రియవల్లభుడూ అయిన శ్రీనివాసుడు... అలా అంబుధిని పురమాయించి అధర్మవర్తనుల ఆటకట్టించాడేమో. అఖిలాండకర్తను మించిన వ్యూహకర్త ఎక్కడైనా ఉంటాడా?

బలిమి అసురులకు భయంకరుడవు
అలరి అమరులకు ఆనందకరుడవు
తలకొని రుషులకు తపఃఫలదుడవు
పలునీ మహిమలు పలుకగ వశమా!

★ ★ ★

మహమ్మద్ కమల్... అధికార కాంక్షాపరుడు. పరిస్థితులూ అతనికి కలిసొచ్చాయి. కర్ణాటక యుద్ధాల్లో ఆర్కాట్ నవాబు చందాసాహెబ్ తనయుడు రాజా సాహెబ్ ఆంగ్లేయ దళాల చేతిలో ఓడిపోయాడు. ఆ రాజకీయ శూన్యాన్ని



అవకాశంగా చేసుకుని, ఆర్కాట్ సైన్యంలోని ఉన్నతాధికారులు ముఠాలుగా చీలిపోయారు. అలాంటి ఓ గుంపుకు నాయకుడే... కమల్. అంతకుముందే అతను నెల్లూరు సీమను ఆక్రమించాడు. అక్కడితో ఆగకుండా, దేవదేవుడి ఐశ్వర్యాల మీద కన్నేశాడు. అప్పటికే, తిరుమల రెవెన్యూ వసూలు హక్కుల్ని ఆర్కాట్ నవాబు నుంచి అధికారికంగా పొందారు ఆంగ్లేయులు. కమల్ దండు బయల్దేరిన సంగతి తెలిసి... ప్రత్యర్థిని నిలువరించేందుకు రెండు కంపెనీల సిపాయిల్నీ, నలభైమంది యూరోపియన్ సైనికుల్నీ, మూడు ఫిరంగుల్నీ పంపారు తెల్లదొరలు. కమల్ రాక్షస బలం ముందు ఆంగ్లేయుల శక్తి సరిపోలేదు. మరుసటి రోజు... ఆర్కాట్ నవాబు సోదరుల్లో ఒకరైన నజీబ్, కెప్టెన్ హాట్ అనే బ్రిటిష్ అధికారీ ససైన్యంగా కమల్‌ను అడ్డుకోడానికి తిరుపతి పొలిమేరల దగ్గర కాపు కాశారు. శ్రీనివాసుడి భక్తుడైన కాళహస్తి ప్రభువు దామర్ల వెంకటప్ప వారికి తనవంతు సాయం అందించాడు. అయినా, కమల్ ముష్కర మూకదే పైచేయి అయ్యింది. ఆ చేదువార్త తెలిసి వెంకటప్ప కుమిలిపోయాడు. తిరుమల శిఖరం వైపు చూస్తూ 'గజేంద్ర వరదా! చలపట్టి కరిరాజు శరణంటె విచ్చేసి... కలుషము ఎడబాపి కాచినట్టు... మమ్మల్నీ కాపాడు' అంటూ పరమాత్మను ప్రార్థించాడు. స్వామి కటాక్షమే కావచ్చు. రెప్పపాటు సమయంలోనే, రణక్షేత్రంలో పరిస్థితులు మారిపోయాయి. ఎక్కడి నుంచో దూసుకొచ్చిన ఓ తూటా కమల్ అధిరోహించిన రాచ ఏనుగును తీవ్రంగా గాయపరిచింది. ఆ మదగజం నొప్పితో హాహాకారాలు చేస్తూ, కుంభస్థలం మీద కూర్చున్న కమల్‌ను తొండంతో కిందికి లాగి పడేసింది. మిగిలిన ఏనుగులూ బెదిరిపోయాయి. శత్రు సైనికుల్ని కాళ్లకింద చీమల్లా నలిపేశాయి. అలనాడు, సిరికిన్ జెప్పక వచ్చి మకరి కోరల నుంచి కాపాడిన మహావిష్ణువు రుణాన్ని గజేంద్రుడు ఇప్పుడిలా తీర్చుకున్నాడేమో! అంతలోనే, వెంకటప్ప అక్కడికి చేరుకున్నాడు. అప్పటికే సగం చచ్చిన కమల్‌ను గొలుసులతో బంధించాడు. ఆ దైవద్రోహికి 1753 అక్టోబరు 2న శిరచ్ఛేదన శిక్ష విధించారు. 'ఎవరు ఏమిటన్నది పరమాత్మకు బాగా తెలుసు. కానీ మనం మాత్రం ఏనాడూ పరమాత్మను తెలుసుకునే ప్రయత్నం చేయం' అని వాపోతారు తాళ్లపాకవారు...

హరియే ఎరుగును అందరి బతుకులు
యిరవై యీతని యెరుగుటే మేలు!

★ ★ ★

1758వ సంవత్సరం. మరాఠా పాలకుడు పీష్వా పన్నుల వసూలు కోసం తన అనుచరుల్ని నేటి రాయలసీమ ప్రాంతానికి పంపాడు. ఆ ఇద్దరి పేర్లూ... రాఘవ, బాలకృష్ణ. అంతలోనే సమీకరణాలు మారిపోయాయి. తక్షణం వెనక్కి వచ్చేయమంటూ ఆదేశాలు అందాయి. నోటి వరకూ వచ్చిన ముద్దను ఎవరో లాగేసుకున్నట్టు అనిపించింది వారికి. అప్పుడే, ఏడుకొండల్ని దోచుకోవాలనే దురాలోచన కలిగింది. కడప ప్రాంతంలో మకాం వేసి, సొంతంగా సైన్యాన్ని సమకూర్చుకున్నారు. ఆయుధాలు సేకరించుకున్నారు. అపార బలగాలతో తోడేళ్ల గుంపులా తిరుమల వైపు దూసుకుపోయారు. తెల్లారేలోపు ఆ దండు కొండకు చేరుకోవచ్చని వేగుల వర్తమానం. ఆలయ అధికారులు దేవుడి మీదే భారం వేశారు. అంతలోనే 'మీరు అనుమతిస్తే, నేను యుద్ధానికి వెళ్తాను. స్వామి కటాక్షంతో శత్రువుల్ని తరిమికొడతాను' అంటూ ఓ యువకుడు ముందుకొచ్చాడు. అతని పేరు శ్రీనివాసాచారి, శ్రీవారి ఆలయంలో పన్నుల సేకర్త. తర్జనభర్జనల తర్వాత, 'ఇదంతా శ్రీవారి ప్రేరణే కావచ్చు!' అనే అభిప్రాయానికి వచ్చారు అధికారులు. అతనికి తోడుగా కొందరు సహాయకుల్నీ పంపారు. 'వేంకటేశ్వరా! రామావతారంలో... హనుమంతుడికి సముద్రాన్ని లంఘించే బలాన్ని ఇచ్చావు. కృష్ణావతారంలో... అర్జునుడికి కౌరవ సేనను ఓడించే ధైర్యాన్ని ప్రసాదించావు. నాకు అంతగొప్ప వరాలేం వద్దు. నీ దివ్యాస్త్రాలతోనూ పన్లేదు. ఓం నమో వేంకటేశాయః అన్న నామబలం చాలు. అదే పదివేల సైన్యం' అంటూ మూలమూర్తి ముందు చేతులు జోడించి ప్రార్థించాడు శ్రీనివాసాచారి. 'విజయోస్తు, దిగ్విజయోస్తు' అని ఆశీర్వదించి ఫల మంత్రాక్షితలు ప్రసాదించారు అర్చక స్వాములు. అలా అని, శ్రీనివాసాచారి యుద్ధ విద్యల్లో ఆరితేరినవాడేం కాదు. కానీ, ఆ సమయంలో ఏ దివ్యశక్తో పూనినట్టు వ్యవహరించాడు. చేయితిరిగిన యోధుడిలా దళాన్ని ముందుకు నడిపించాడు. రోజంతా జరిగిన పోరాటంలో ఇద్దరు ద్రోహులనూ హతమార్చాడు. కుట్రలో మరో భాగస్వామి బల్వంత్‌రావు బేషరతుగా లొంగిపోయాడు. 'నేను మహాపరాధం చేశానని తెలుసు. నాకు మరణం తప్పదనీ తెలుసు. కానీ చనిపోయే ముందు ఒక్కసారి స్వామిని కళ్లారా దర్శించుకోవాలని ఉంది' అని సజల నేత్రాలతో వేడుకున్నాడు. కాదనలేకపోయాడు శ్రీనివాసాచారి. ఏడుకొండలవాడి దివ్యమోహన రూపాన్ని కళ్లలో నింపుకుని... 'నా జన్మధన్యం. ఇక ముక్తిని ప్రసాదించండి' అంటూ చావుకు సిద్ధపడ్డాడు బల్వంత్‌రావు. అతనిలోని పరివర్తనను గుర్తించి, క్షమించి వదిలేశారు ఆలయ అధికారులు. స్వామివారి సేవలో చరితార్థుడైన శ్రీనివాసాచారి భవిష్యత్తులో ఎంతో ఉన్నత స్థానానికి ఎదిగాడు.

ఏ పురాణముల నెంత వెదికినా...
శ్రీపతి దాసులు చెడరెన్నడును!

★ ★ ★

విజయనగర సామ్రాజ్యాన్ని... అరవీడు

వంశానికి చెందిన రామదేవరాయలు పాలిస్తున్న కాలమది. అతను పరమలోభి. స్వర్ణాభరణాలంటే తగని వ్యామోహం. ఎవరైనా తప్పు చేస్తే రాజుకు చెబుతారు. పాలకుడే పాపాల భైరవుడైతే? తప్పదు, శ్రీనివాస సార్వభౌముడు జోక్యం చేసుకోవాల్సిందే. శిశుపాలుడిని వంద తప్పుల వరకూ కాచిన స్వామి, భూపాలుడైన రామదేవుడికి కూడా చాలా అవకాశాలే ఇచ్చాడు. అయినా అతనిలో మార్పు రాలేదు. విలాసాలతో, యుద్ధాలతో, అనాలోచిత నిర్ణయాలతో ఖాళీ అయిపోయిన ఖజానాను నింపుకోడానికి శ్రీవారి ఆలయ సంపదల మీదా కన్నేశాడు. అప్పు పేరుతో చాలా సొమ్మును తరలించుకుని వెళ్లాడు. అయినా వడ్డీకాసులవాడు ఓపికతో ఉపేక్షించాడు. రామదేవుడికి శకునిలాంటి ఓ మంత్రి ఉండేవాడు. "న విష్ణుః పృథివీ పతిః విలువైన వజ్ర కిరీటాన్ని సార్వభౌములైన తమరు ధరించాలి కానీ, గర్భాలయంలోని రాతి విగ్రహానికి ఎందుకూ?" అని రెచ్చగొట్టాడు. ఆ విషపు మాటలు రామదేవుడి మీద బాగా పనిచేశాయి. "మంచి ఆలోచనే. వెంటనే ఆ కిరీటాన్ని తెప్పించండి..." అని ఆదేశించాడు. ప్రభువు అనుమతించగానే, ఆ సలహాదారుడు శత్రువుపైన దాడికి బయల్దేరినంత ఆవేశంగా సైన్యాన్ని వెంటబెట్టుకుని తిరుమలకు ప్రయాణం అయ్యాడు. కొంతదూరం వెళ్లాడో లేదో... తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అక్కడికక్కడే రక్తం కక్కుకుని చచ్చాడు. అయినా, రామదేవుడికి బుద్ధి రాలేదు. తానే తిరుమలకు వెళ్లి కిరీటాన్ని స్వాధీనం చేసుకుంటానంటూ బీరాలు పలికాడు. అంతలోనే, ఏదో అంతుచిక్కని రోగంతో మరణించాడు. ఆ చావులకు కచ్చితమైన కారణాలు తెలియవు. ఆ ఇద్దరి అరాచకాలూ చూడలేక, అంతఃపుర పరివారంలోనే ఎవరో విష ప్రయోగం చేసుంటారని ఓ ప్రచారం. ఎలా అయితేనేం, దుష్టసంహారం జరిగిపోయింది. 'బ్రహ్మకు పరబ్రహ్మగా, ఈశ్వరుడికి పరమేశ్వరుడిగా, మహాత్ములకు పరమాత్మగా దర్శమిచ్చే దేవదేవుడు... ఖలులకు మాత్రం కఠిన శిలగా కనిపిస్తాడు' అంటారు అన్నమాచార్యులు. రామదేవ మహారాజు దేవుడిలో రాతిని చూశాడు. నల్లరాయే కనిపించింది. రాతిలో దేవుడిని చూసుంటే... తన పూర్వీకులకు సకల సంపదలూ, సమస్త వైభోగాలూ ప్రసాదించిన తిరుమలగిరిరాయల దివ్యరూపం సాక్షాత్కరించేది. భవబంధాలూ, అరిషడ్వర్గాలూ... పుటుక్కున తెగిపోయేవి.

అంతరంగమెల్ల శ్రీహరికి ఒప్పించకుంటె...
వింతవింత విధముల వీడునా బంధములు!

★ ★ ★

"స్వామీ! వేదమంత్రాలు ప్రతిధ్వనించాల్సిన చోట హాహాకారాలు వినిపిస్తున్నాయి. అభిషేక జలాలు ప్రవహించాల్సిన ఆలయాల్లో రక్తపుటేర్లు పారుతున్నాయి. మా మొర ఆలకించి, ఆ ముష్కర మూకల్ని గోలకొండ వరకూ తరిమేయవయ్యా... శత్రు సంహార వేంకటాచల విహార!" అంటూ ఓ అజ్ఞాత కవి శ్రీనివాసుడికి మొరపెట్టుకున్న శతక పద్యాలు - కుతుబ్‌షాహీల కాలంలో అలీ అనే గోల్కొండ సైన్యాధికారి తిరుపతి పరిసరాల్లో సృష్టించిన అరాచకాల్ని కళ్లకు కడతాయి. అదో దురదృష్టకర సమయం. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు కొండ కిందే నిలువు దోపిడీ జరిగిపోయేది. రకరకాల పేర్లతో పన్నులు పిండుకునేవారు. కట్టకపోతే కొరడా దెబ్బలే. అక్కడితో ఆగకుండా, సప్తగిరుల మీద జెండా పాతాలన్నది అలీ ఆలోచన. అనుకున్నట్టే, ఓ రోజు ఏడుకొండల కిందికి చేరుకున్నాడు. తిరుమలకు వెళ్లేందుకు ఏ దారిని ఎంచుకోవాలా అని ఆలోచిస్తున్నాడు. తదుపరి ఆదేశాల కోసం, ఆనందనిలయ మార్గాన్ని తెలిపే పటాన్ని అలీ చేతికిచ్చాడు అనుచరుడు. 'శేషాద్రి, నీలాద్రి, గరుడాద్రి, అంజనాద్రి... చివరగా వేంకటాద్రి. వరాహస్వామి ఆలయాన్ని దాటుకుని వెళ్తే స్వామి పుష్కరిణి. పక్కనే..' - అలీ చూపులు పటంలో వరాహస్వామికి సంకేతంగా గీసిన రేఖా చిత్రం దగ్గరే ఆగిపోయాయి. 'ఇదేమిటి...?' అని కళ్లు చిట్లించాడు. 'తిరుమల ఆదివరాహ క్షేత్రం నవాబ్!' వివరంగా చెప్పాడు అనుచరుడు. చూస్తూ చూస్తూ, 'పంది'ని దాటుకుని వెళ్లడానికి అలీ మనసు అంగీకరించలేదు. అసహనంగా వెనుదిరిగాడు. ఆ చోటే నేటి... 'అలిపిరి' అని అంటారు. దూరం నుంచీ ఇదంతా గమనిస్తున్న భక్తులు... ఇది స్వామి మహిమేనంటూ, అలీ పీడ విరగడైనందుకు ఆనందంగా హరి కీర్తనలు అందుకున్నారు...


అదెవచ్చె నిదెవచ్చె నచ్చుతు సేనాపతి...
పది దిక్కులకు నిట్టె పారరో అసురులు!

★ ★ ★

మోహిని అవతారమెత్తి... భస్మాసురుడిపై వలపు వల విసిరిన జగన్నాటక సూత్రధారి... తిరుమల పట్ల ద్వేషం పెంచుకున్న దోపిడీ మూకలకు కాసుల ఎర చూపించి కట్టడి చేశాడు. ఒకేసారి ఆలయ సంపదల్ని దోచుకోవడం కంటే, ఏ గుత్తేదారులకో నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే... ఏటా లక్షల వరహాలు పిండుకోవచ్చనే ఆశను రేకెత్తించాడు. అలా శత్రువుల్ని విభజించి పాలించాడు. సొత్తుల మాయలో పడిపోయి, ఒకరి గొయ్యి ఒకరు తవ్వుకున్నారు వారంతా. ఓ దశలో, ఆలయాల నిర్వహణలో బ్రిటిష్ వారి జోక్యం పట్ల చాలా ప్రాంతాల్లో వ్యతిరేకత వ్యక్తమైంది. అది కాస్తా తిరుగుబాటుగా మారుతుందనే భయంతో... మొత్తంగా భారతీయుల ఆధ్యాత్మిక వ్యవహారాల్లో వేలు పెట్టకూడదని బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో, తిరుమల పాలన పగ్గాలు మహంతుల చేతికి వెళ్లాయి. ఆ తర్వాత, 1933లో మద్రాసు సర్కారు తిరుమల తిరుపతి దేవస్థానాల పాలక మండలిని నియమించింది.

ఒక్కసారి సింహావలోకనం చేసుకుంటే... కాలక్రమంలో ఎన్నో మార్పులు. సుల్తానుల పాలన అంతరించింది. విదేశీయులు స్థావరాలను ఖాళీ చేసి వెళ్లిపోయారు. రాజ్యాలూ సంస్థానాలు కుప్పకూలి పోయాయి. శ్రీవేంకటేశ్వరుడి వైభవం మాత్రం నిత్యమై, సత్యమై నిలిచి వెలుగుతూనే ఉంది...

శ్రీమన్ వేంకట శిఖర నివాస మ
హామహిమన్ నిఖిలాండపతే
కామితఫల భోగప్రద తే నమో
స్వామిన్ భూమన్ సర్వాత్మన్! ★



అవీ ఇవీ



రెడ్ కార్పెట్ చెకింగ్...

ఎయిర్‌పోర్టుల్లో అడుగుపెడితే ముందుగా గుర్తుకొచ్చేదేంటి? అక్కడి అధికారులు చేసే వెరిఫికేషన్‌లూ, గంటలకొద్దీ క్యూలో నిలబడి అసహనంతో కనిపించే జనాలూ. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అడుగుపెడితే మాత్రం ఆ బాధలేవీ ఉండవు. అక్కడ ఏ అధికారీ ఒక్క ప్రశ్నా వేయరు, వాళ్లకు... బోర్డింగ్ పాస్‌లూ, పాస్‌పోర్టులూ చూపించాల్సిన అవసరం కూడా లేదు. వాళ్లు చూపించిన దారిలో వెళ్తే చాలు సెకన్లలో విమానం ఎక్కేయొచ్చు... అదెలా అంటారా? దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ మొదటిసారిగా ఏఐ కారిడార్‌ని ఏర్పాటు చేసింది. దీన్నే రెడ్ కార్పెట్ అని కూడా అంటున్నారు. ఈ దారిలో వెళ్తే... ఎటువంటి పత్రాలూ చూపించకుండా కేవలం ఫేషియల్ రికగ్నిషన్, ఏఐ టెక్నాలజీ సాయంతో చెకింగ్‌లన్నీ వాటంతట అవే జరిగిపోతాయి. ఈ ఏఐ కారిడార్ పద్నాలుగు సెకన్ల సమయంలో 10 మంది పాసింజర్లని చెకింగ్ చేసి పంపేస్తుంది. దుబాయ్ నుంచి ఏటా కోట్లమంది విమానాల్లో ప్రయాణిస్తుంటారు. ప్రయాణికుల చెకింగ్‌కి పట్టే సమయాన్ని గంటల నుంచి సెకన్లలోకి తీసుకురావడానికి ఇలా ఏఐ కారిడార్‌ని ఏర్పాటు చేశారు అక్కడ.

భలే బెంచీలు...

ఎవరి ఇంట్లో వాళ్లు బందీలుగా మారిపోతున్న వేళ, ప్రజలు ఆరుబయటకు వచ్చేందుకు ప్రోత్సహిస్తూ స్పెయిన్ ప్రభుత్వం ఓ సరికొత్త ప్రయోగం చేసింది. ఇందుకోసం పార్కులూ, బస్టాపుల్లో ఉండే పబ్లిక్ బెంచీలను స్మార్ట్ బెంచీలుగా మార్చేసింది. సోలార్ ప్యానెళ్లున్న ఈ బెంచీల సాయంతో ఫోన్లూ, ల్యాప్‌టాప్‌లని ఛార్జింగ్ చేసుకోవచ్చు. అలాగే ఉచిత వైఫై సేవలనీ అందుకోవచ్చు. బెంచీలకు అమర్చిన డిస్‌ప్లేలో ఎప్పటికప్పుడు వెదర్ రిపోర్ట్‌లను అందుకుంటూ ప్రయాణాలు ప్లాన్ చేసుకోవచ్చు. ఈ మధ్యకాలంలో ప్రజలు బయటకు రాకుండా ఇంటికే పరిమితం అయిపోవడం స్పెయిన్ ప్రభుత్వంలో ఆందోళనని రేపింది. ప్రజలు ఇళ్లకే పరిమితం అయిపోకుండా నలుగురూ కలిసే పార్కుల్లోకీ, రోడ్లమీదికీ రావాలని ఈ రకమైన ఆలోచన చేసింది. అదొక్కటే కాదు ప్రజలు సంప్రదాయ ఇంధనాల వాడకాన్ని తగ్గించుకుని, కాలుష్యాన్ని వెలువరించని గ్రీన్ ఎనర్జీపైన అవగాహన పెంచుకోవడం కూడా ఈ స్మార్ట్ బెంచీల ఏర్పాటు వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశమట. తొలుత ఏర్పాటు చేసిన బెంచీలకు ఆదరణ రావడంతో దేశమంతటా ఈ గ్రీన్ ఫర్నిచర్‌ని ఏర్పాటు చేస్తోంది స్పెయిన్ ప్రభుత్వం.




నాలుగు తరాల మైత్రి...

స్నేహం గొప్పతనాన్ని చాటే కథలు ఎన్నో విని ఉంటారు. కానీ ఈ కథ కాస్త భిన్నమైంది. తొంభై ఏళ్ల క్రితం మాట... సూరత్‌లో బిపిన్‌దేశాయ్, గుణ్వంత్ దేశాయ్ అని ఇద్దరు స్నేహితులు ఉండేవారు. వీళ్లు స్కూల్‌కి కలిసివెళ్లేవారు, ఇంటి నుంచి తెచ్చుకున్నదేదో కలిసే తినేవారు. అలా మొదలైన వీళ్ల దోస్తీ... గాంధీజీ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనమని ఇచ్చిన పిలుపుతో మరింత బలపడింది. ఆ ఉద్యమంలో బిపిన్, గుణ్వంత్‌లు కలిసి జైలుకి వెళ్లారు. అటు నుంచి వచ్చిన తర్వాత పుణె యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసుకుని, ఇద్దరూ కలిసి పాలవ్యాపారం నడిపి, లాభాలు ఆర్జించారు. పెళ్లైనా ఇద్దరూ విడిపోకూడదని సూరత్‌లో మైత్రి పేరుతో ఒక భవనాన్ని కట్టుకుని కలిసే ఉండేవారు. వీళ్ల పిల్లలు గౌతమ్, పరిమళ్ కూడా పెద్దవాళ్ల స్నేహాన్ని గౌరవించాలని కుటుంబాలతో ఇదే భవనంలో కలిసి ఉన్నారు. కొన్నాళ్లకు బిపిన్, గుణ్వంత్‌లు చనిపోయారు. పిల్లలు మాత్రం మైత్రీ ఛారిటీ పేరుతో సంస్థను ఏర్పాటు చేసి సేవాకార్యక్రమాలు కొనసాగించారు. ప్రస్తుతం గౌతమ్‌కూ, పరిమళ్‌కూ మనవలూ, మనవరాళ్లూ పుట్టేశారు కానీ, అదే భవనంలో కలిసి ఉండటం విశేషం. అన్నదమ్ములే కలిసి ఉండటం గగనమవుతున్న ఈ రోజుల్లో స్నేహానికి విలువనిచ్చి నాలుగు తరాల మనుషులు కలిసి ఉండటం అంటే గొప్పవిషయమేగా!




గాల్లోంచి వెన్న...

మైసూర్‌పాక్‌లో మైసూర్ ఉండదంటే సరిపెట్టుకుంటాం కానీ, పాలు లేకుండా వెన్నని తయారుచేయొచ్చంటే నమ్మడం కష్టం కదా! కానీ కాలిఫోర్నియాకు చెందిన స్టార్టప్ కంపెనీ గాల్లోంచి వెన్నని తీయడమే కాదు... దాంతో రుచికరమైన వంటకాలు కూడా చేస్తోంది. కాలిఫోర్నియాలోని సేవర్ అనే స్టార్టప్ సంస్థ థెర్మోకెమికల్ ప్రాసెస్ ద్వారా గాల్లోని కార్బన్‌డైఆక్సైడ్‌ని వేడిచేసి బటర్‌ని తయారుచేస్తోంది. పాల నుంచి తీసిన వెన్నకి ఉండే రుచి దీనికి ఎక్కడ నుంచి వస్తుంది అనుకునేరు, సాధారణ బటర్ మాదిరిగానే ఈ ల్యాబ్ బటర్ కూడా రుచిగానే ఉండటంతో ఆదరణ పెరిగింది. రుచి ఒక్కటే దీని ప్రత్యేకత కాదు... కాలుష్యాన్నీ తగ్గిస్తుంది. అదెలా అంటే, సంప్రదాయ పద్ధతిలో అయితే పశువుల పెంపకం, దాణా, నీళ్ల వాడకం, పాలనుంచి వెన్నను వేరే చేసే ప్రక్రియ అన్నీ కలిపి ఖర్చు తడిసిమోపెడు అవుతుంది. అంతేనా ఈ క్రమంలో బోలెడు కలుషితాలు కూడా వెలువడతాయి. కేజీ వెన్న రావాలంటే గాల్లోకి సుమారుగా 16 కేజీల కార్బన్ విడుదల అవుతుంది. ఇవేమీ లేకుండా గాల్లోంచి వెన్న తీసే విధానం నచ్చడంతో బిల్‌గేట్స్ ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టి ఈ బటర్‌ని అందరికీ పరిచయం చేస్తున్నాడు.




రోబో జడ్జీలు వచ్చేస్తున్నారు!

ఏ పనిచెప్పినా చకచకా చేసుకుపోయే రోబోల గురించి విని ఉంటారు. ఆటలాడే రోబోలూ, సర్జరీలు చేసే రోబోల గురించి కూడా విని ఉంటారు. మరి... 'రోబో జడ్జీల' గురించి ఎప్పుడైనా విన్నారా? త్వరలో మన న్యాయవ్యవస్థలోకి అడుగుపెట్టనున్న ఈ రోబో జడ్జీల పనితీరు ఎలా ఉంటుందో తెలుసుకోవాలని ఉందా... మరెందుకు ఆలస్యం, రండి!





కోర్టులూ, లాయర్లూ, జడ్జీలూ, వాదోపవాదాలూ, ఏళ్ల తరబడి సాగే వాయిదాలూ... పాతమాట. 'ఇంటర్నెట్ కోర్టులు' కొత్తమాట. ఇక్కడ మనుషులు హాజరు కావాల్సిన పనే లేదు. వ్యవహారమంతా వర్చువల్‌గానే ఉంటుంది. వాద, ప్రతివాదాలన్నీ మహా అయితే 20 నిమిషాల్లో పూర్తయిపోతాయి. కేసు సంవత్సరాల తరబడి సాగే ఊసే లేదు... రోజులూ వారాల్లోనే తీర్పు వచ్చేస్తుంది. రాత్రీ, పగలూ ఈ కోర్టులు అందుబాటులోనే ఉంటాయి. ఆహా... ఇవన్నీ నిజమైతే ఎంత బాగుండును అనిపిస్తోంది కదూ! ఇవన్నీ నిజంగా నిజమే. కాకపోతే మనదేశంలో కాదు... చైనాలో! అవును, కొవిడ్‌కి ముందు మొదలైన ఈ ఇంటర్నెట్ కోర్టుల ఏర్పాటు క్రమంగా ఊపందుకుందక్కడ. ఈ తరహా స్మార్ట్ కోర్టుల్లో ఇంతవరకూ నాలుగు లక్షల కేసులు నమోదైతే ఇప్పటికే 85 శాతం కేసుల్లో తీర్పుకూడా వచ్చేసింది. అయితే ఈ కోర్టుల్లో ప్రధానంగా కాపీరైట్స్‌కి సంబంధించిన వివాదాలూ, ఆన్‌లైన్లో వస్తువులు కొన్నప్పుడు ఎదురయ్యే ఈ- కామర్స్ సంబంధిత ఇబ్బందులూ, ట్రాఫిక్ చలాన్లకు సంబంధించినవి- అంటే, త్వరగా తీర్పు చెప్పగలిగే కేసులే ఇక్కడకు వస్తాయి. ఎస్టోనియా.... చైనాకంటే ఒక అడుగు ముందే ఉందీ దేశం. ఇక్కడ సివిల్, క్రిమినల్ అని తేడా లేకుండా ఏ తరహా కేసులైనా ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలోనే నమోదవుతాయి. ఎక్కడా కాగితాలతో పని ఉండదు. దేశమంతా ఈ- జస్టిస్ విధానమే అమల్లో ఉంది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 'వన్స్-ఓన్లీ' పద్ధతిలో ఆ కేసుకి సంబంధించిన సమస్త వివరాలూ- పోలీసులూ, న్యాయవాదులూ, న్యాయమూర్తులకు ఒక క్లిక్ దూరంలోనే అందుబాటులో ఉంటాయి. జర్మనీ కూడా టెక్నాలజీని వాడి లిటిగేషన్ కేసుల పరిష్కారంలో 50 శాతం వేగాన్ని సాధించిందట. ఈ దేశాలు మాత్రమే కాదు ఆస్ట్రేలియా, జర్మనీ, మొరాకో దేశాలు కూడా తమతమ దేశాల్లో ఈ- కోర్టులనీ, స్మార్ట్ కోర్టులనీ ఏర్పాటు చేసి ఏఐ టెక్నాలజీ, బ్లాక్ చెయిన్ టెక్నాలజీల సాయంతో ప్రజలకు న్యాయాన్ని వేగంగా అందించే ప్రయత్నాలు చేస్తున్నాయి. అంతా బాగుంది కానీ... వీటికీ మనకీ ఏంటి సంబంధం అనుకుంటున్నారు కదా! ఈ దేశాల స్ఫూర్తితోనే మన దేశంలోనూ 'రోబో జడ్జీ'లను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.



సింగపూర్‌లో శిక్షణ...

రోబోలంటే మర మనుషులు కదా! 'అమ్మో... మరమనుషులు వచ్చి న్యాయమూర్తి స్థానంలో కూర్చుని 'ఆర్డర్ ఆర్డర్' అంటూ తీర్పులు చెప్పేస్తాయా' అనేగా మీ సందేహం. అదేమీ కాదు... ఏఐ టెక్నాలజీ వాడుకుని పెండింగ్ కేసులని త్వరితంగా పూర్తి చేయడానికి న్యాయవ్యవస్థకు ఉపయోగపడే సహాయక వ్యవస్థ పేరే ఈ 'రోబో జడ్జీ'. ఇవి డేటా ఆధారంగా పనిచేస్తాయి. పెద్దగా సమయం తీసుకోని- ట్రాఫిక్ చలాన్లు, స్పీడ్ డ్రైవింగ్, చిన్నపాటి వివాదాలు... తదితర కేసులని ఇవి నిమిషాల్లో పరిష్కరిస్తాయి. అలాగని ఇవేమీ నేరుగా తీర్పు చెప్పవు. కేసుని ఆసాంతం విశ్లేషించి ఆ వివరాలను క్రోడీకరించి... జడ్జిగారి ముందు ఉంచుతాయి, ఆ తర్వాత నిర్ణయం న్యాయమూర్తులదే. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే 80 మంది ఐసీటీ అధికారులూ, జిల్లా న్యాయమూర్తులూ సింగపూర్‌లో శిక్షణ అందుకున్నారు. చైనా, ఎస్టోనియా దేశాల్లో విజయవంతమైన ఏఐ న్యాయ నమూనాలని అధ్యయనం చేసి, మన దేశానికి తగిన విధంగా స్వదేశీ వ్యవస్థను నిర్మించుకోవడమే ఈ శిక్షణ లక్ష్యమట. ఇప్పటికే ముంబయి, బెంగళూరు, దిల్లీల్లో ఏఐ టెక్నాలజీని వాడి కేసులని త్వరితంగా పరిష్కరించేందుకు పైలట్ ప్రాజెక్టునీ నిర్వహించారు. ఈ విధానంలో పెండింగు కేసులు 20 శాతం తగ్గినట్టు నేషనల్ జ్యుడిషియల్ డేటా గ్రిడ్ చేసిన అధ్యయనం చెబుతోంది.

కొత్త కొలువులకి ఆసరా...

ఏఐ అన్ని పనులూ చేసుకుంటూ పోతే... మరి ఈ రంగంలో ఉద్యోగాల మాటేంటీ అనే అనుమానం రావొచ్చు. లీగల్ మేనేజ్‌మెంట్, లీగల్ రిసెర్చ్, లీగల్ ట్రాన్స్‌లేషన్‌లాంటి పనులు సాధారణంగా ఎక్కువ సమయం తీసుకుంటాయి. అలాంటి పనులని ఈ ఏఐ టూల్స్ క్షణాల్లో చేసేస్తూ అధికారులకు సాయపడతాయేకానీ వాళ్లస్థానాన్ని ఆక్రమించుకోవు అంటున్నారు నిపుణులు. 'ఇప్పటికే మన కోర్టుల్లో కొన్ని రకాల ఏఐ టూల్స్‌ని వాడుతున్నాం. ఉదాహరణకి ఏపీలో ఉపయోగిస్తున్న అదాలత్ ఏఐ, సువాస్ వంటి వాటినే తీసుకోండి... అవి జడ్జిలు ఇచ్చిన తీర్పులని స్థానిక భాషల్లోకి వేగంగా అనువాదం చేస్తున్నాయి. అలాగే మరికొన్ని ఏఐ టూల్స్ డాక్యుమెంటేషన్, సైటేషన్ వంటి పనులనీ తక్కువ సమయంలో చకచకా చేస్తాయి' అంటున్నారు ఏపీ న్యాయసేవాధికార సంస్థ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ అమర రంగేశ్వరరావు. అంటే ఏఐ పరిజ్ఞానం పెంచుకుంటే కొత్తతరానికి ఈ రంగంలో కొలువులకు లోటు ఉండదన్నమాట! ★

పరిశోధన

దగ్గరిచూపుకి ఒమేగా-3

నేటి తరం పిల్లల్లో పదిశాతం మంది... బోర్డుపైన ఉన్న అక్షరాలు చూసి రాయలేకపోతున్నారు! దూరంగా ఉన్నవాటిని చూడలేక పోవడమే (షార్ట్ సైట్-మయోపియా) ఇందుకు కారణం. మనదగ్గరే కాదు... ప్రపంచవ్యాప్తంగా ఈ సమస్య ఇదే స్థాయిలో ఉందట. పిల్లల్లో మొబైల్ వాడకం పెరగడం, ఆరుబయట ఆడుకునే అవకాశం తగ్గడమే ఇందుకు కారణమని ఇంతకాలం శాస్త్రవేత్తలు భావిస్తూ వచ్చారు. కానీ ఈ రెండింటికన్నా పిల్లలు ఒమేగా-3 యాసిడ్స్ ఉన్న ఆహారం తీసుకోక పోవడమే ముఖ్య కారణమని తేల్చారు యూనివర్సిటీ ఆఫ్ హాంకాంగ్ శాస్త్రవేత్తలు. ప్రధానంగా చేపలూ, కొంతవరకూ వాల్‌నట్స్ వంటివాటిల్లో ఉంటాయీ ఒమేగా-3 యాసిడ్స్. మనం వాటికి బదులు వెన్న, పామ్ ఆయిల్‌తో చేసిన పదార్థాలని ఎక్కువగా తీసుకోవడమే పిల్లల్లో మయోపియాకి కారణమవుతోందని ఈ శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఐదు నుంచీ పదిహేనేళ్ల లోపున్న సుమారు వెయ్యిమంది పిల్లలపైన అధ్యయనం చేసి ఈ విషయాలని వెల్లడించారు వాళ్లు. షార్ట్ సైట్‌తో బాధపడుతున్న పిల్లలకి ఓ మూణ్నెళ్లపాటు ఒమేగా-3 పుష్కలంగా ఉన్న ఆహారాన్ని ఇచ్చాక... వాళ్ల కంటిచూపు మెరుగవ్వడాన్ని గమనించామని చెబుతున్నారు!



ఆ క్యాన్సర్ మళ్లీ రాకుండా..!

ఆధునిక వైద్య వసతుల పుణ్యమాని... ప్రస్తుతం రొమ్ము క్యాన్సర్ నుంచి ఎంతోమంది బయటపడగలుగుతున్నారు. కానీ, అలా బయటపడ్డవాళ్లలో 30 శాతం మందికి ఆ సమస్య తిరగబెడుతుంటుంది. అలా తిరగబెట్టినప్పుడు అది మరింత ప్రాణాంతకంగా మారుతుంది. ఈ సమస్యకి ప్రపంచంలోనే తొలిసారి ఓ శాశ్వత పరిష్కారాన్ని కనిపెట్టారు అమెరికాలోని పెన్సిల్వేనియా శాస్త్రవేత్తలు. మామూలుగా రొమ్ము క్యాన్సర్ బాధితులకి తొలిసారి చికిత్స అందించేటప్పుడు... కొన్ని క్యాన్సర్ కణాలు నిద్రాణంగా ఉండిపోయి మన ఎముక మజ్జలో దాక్కుంటాయి. అలా దాక్కుని, కొన్ని నెలల తర్వాతో కొన్ని దశాబ్దాల తర్వాతో మేల్కొని, రక్తంలో చేరి... మరింత తీవ్ర క్యాన్సర్‌గా పరిణమిస్తాయి. నిద్రాణంగా ఉన్న ఈ కణాలు మామూలు స్కానర్‌లకి కనపడకపోవడం వల్ల శాస్త్రవేత్తలకి ఇదో తలనొప్పిగా ఉండేది. ఇప్పుడు వాటిని కూడా పసిగట్టే- లేజర్‌తో పనిచేసే- 'ఫ్లో సైటోమెట్రిక్' అనే విధానాన్ని కనిపెట్టారు పెన్సిల్వేనియా శాస్త్రవేత్తలు. అక్కడితో ఆగలేదు, అలా నిద్రాణమైన కణాలని మట్టుబెట్టే మందుల్నీ గుర్తించారు. ఈ మధ్యే దీనికి సంబంధించిన క్లినికల్ ట్రయల్స్ కూడా జరిగాయి. అందులో నిద్రాణమైన క్యాన్సర్ కణాలని పసిగట్టడమే కాదు... మందుల్ని వాడి వాటిని వందశాతం నిర్జీవం చేశారట. రొమ్ము క్యాన్సర్ పరిశోధనలో ఇది అతిపెద్ద ముందడుగని చెబుతున్నారు.



రోజుకో నిమిషం చాలు...!



ఓ వైపు వైద్యులూ మరోవైపు శాస్త్రవేత్తలూ ఎంత చెబుతున్నా సరే... ప్రపంచవ్యాప్తంగా క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవారి సంఖ్య 15 శాతానికి మించట్లేదట. రేపూమాపూ అంటూ కాలం గడిపేసేవాళ్లూ... ఆరంభశూరుల్లా కొన్నాళ్లు చేసి మానేసేవాళ్లే మనలో ఎక్కువట. ఇలాంటివాళ్ల కోసమే ఓ కొత్త సూచన చేస్తున్నారు ఆస్ట్రేలియాలోని సిడ్నీ వర్సిటీ శాస్త్రవేత్తలు. 'మీరు మెట్లెక్కాలా... చాలా వేగంగా ఎక్కండి. చేతిలో బరువుంటే ఇంకా మంచిది! పిల్లలతో ఆటలాడాలా... వాళ్లతో సమానంగా పరుగెత్తండి, గంతులేయండి. ఏదేమైనా మీ ఉచ్ఛ్వాసనిశ్వాసాలూ, గుండె వేగమూ బాగా పెరిగేలా చూసుకోండి... అలా ఓ పది క్షణాలు చాలు. ఆ రకంగా రోజుకి ఆరేడుసార్లు (రోజు మొత్తంలో ఒక్క నిమిషం) తీవ్రమైన శారీరక శ్రమ ఏదైనా ఉండేలా చూసుకోండి' అని చెబుతున్నారు. దీన్నే విగరస్ ఇంటర్మిటెంట్ లైఫ్‌స్టైల్ ఫిజికల్ యాక్టివిటీ(విల్పా) అంటున్నారు వాళ్లు. ఇలా చేయడం వల్ల హృద్రోగాలూ, క్యాన్సర్‌ల నుంచి కాపాడుకోవచ్చంటున్నారు. ఏ వ్యాయామమూ చేయని వాళ్లకన్నా రోజూ ఇలాంటి శారీరక శ్రమ చేసేవాళ్లలో ఆయుష్షు 38 శాతం పెరుగుతోందని చెబుతున్నారు. సుమారు 3,300 మంది మధ్య వయస్కుల జీవనశైలిని గమనించి ఈ విషయాన్ని వెల్లడిస్తున్నారు వాళ్లు.

పిప్పి పళ్లు ఉండవిక...!



పిప్పి పన్ను... వయసుకి అతీతంగా అందర్నీ వేధించే సమస్య. దీనికో కొత్త పరిష్కారం కనిపెట్టారు యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా- బెర్కలీకి చెందిన పరిశోధకులు. మామూలుగా మన నోట్లో వెయ్యికోట్లకి పైగా బ్యాక్టీరియా ఉంటాయి. వాటిల్లో అటు మంచి చేసేవీ ఇటు చెడు చేసేవీ రెండూ ఉంటాయి. చెడు చేసేవాటిల్లో 'స్ట్రెప్టోకాకస్ మ్యూటన్స్(ఎస్.మ్యూటన్స్)' అనే బ్యాక్టీరియానే పిప్పిపళ్లకి కారణమవుతుంది. ఈ బ్యాక్టీరియా పంటికి అంటుకుపోవడమే కాదు... ఒకదాని పక్కన ఒకటి ఓ హారంలా ఏర్పడి పాచి(బయోఫిల్మ్)గా మారుతుంది. క్రమంగా అదే పిప్పిపన్నుకి దారితీస్తుంది. చెడు బ్యాక్టీరియా ఇలా పంటికి అంటుకుపోవడానికీ, పాచిలా పేరుకుపోయి తమ సంఖ్య పెంచుకోవడానికీ సాయం చేసే డీఎన్‌ఏని ఇటీవల కనిపెట్టారు కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు. ఈ డీఎన్‌ఏ మనకి మంచి చేసే 'స్ట్రెప్టోకాకస్ సాలివేరియస్'లాంటి బ్యాక్టీరియాకి లేకపోవడం వల్లే అవి చెడు బ్యాక్టీరియా పైన పోరాడ లేకపోతున్నాయని గ్రహించారు వాళ్లు. 'మరి చెడుచేసే బ్యాక్టీరియాలోని ఆ డీఎన్‌ఏని... మంచి చేసే బ్యాక్టీరియాకి పెడితే ఎలా ఉంటుంది?' అన్న ఆలోచన వచ్చింది పరిశోధకులకి. వచ్చిందే తడవుగా ఆ మేరకు ప్రయోగం చేసి... సక్సెస్ అయ్యారు. ఆ రకంగా నోటిలో మంచి బ్యాక్టీరియాని పెంచి... చెడువాటిని విజయవంతంగా తగ్గించగలిగారు. ఓ ప్రొబయోటిక్ పేస్ట్‌తో... జీవితంలో ఎన్నడూ పిప్పిపన్ను రాకుండా అడ్డుకోవచ్చని చెబుతున్నారు.





వీరివీరి గుమ్మడిపండు... వీరి పేరేంటి..?













ఆల్బమ్ తెరిచి చిన్నప్పటి ఫొటోలు చూస్తుంటే ఎంత మురిపెంగా ఉంటుందో కదా! ఒక్కసారిగా ఆ జ్ఞాపకాలన్నీ చుట్టుముట్టి పాత రోజుల్లోకి వెళ్లిపోతాం. అపురూపమైన బాల్యం కళ్లముందుకొచ్చేస్తుంది. కెమెరాలూ, ఫోన్లూ ఇంతలా అందుబాటులోలేని కాలంలోనూ ఆ అనుభూతిని మిస్ అవ్వకుండా- స్టూడియోలకి వెళ్లి మరీ ఫొటోల్ని తీయించుకునేవాళ్లు. ఇంటికొచ్చిన అతిథులకు మొదటి కాలక్షేపమూ ఆ ఆల్బమే. అంతేనా, ముద్దులొలికే బుజ్జాయిల ఫొటోల ఫ్రేములే గోడలకు అలంకరణలూ అయ్యేవి. అందుకే ఏ కాస్త సమయం దొరికినా అమ్మానాన్నలూ చిన్నారుల పాత ఫొటోల్ని తిరిగేస్తూ ఎంతో సంబరపడిపోతుంటారు. 'చూడు అప్పుడు ఎంత లడ్డులా ఉన్నావో... ముత్యమంత ముక్కూ, చిట్టి నోరూ, పెద్ద పెద్ద కళ్లూ, రింగుల జుట్టూ...' అంటూ తమ పిల్లల చిన్ననాటి రూపురేఖల్నీ, వాళ్లు చేసిన ముద్దు ముద్దు చేష్టల్నీ గుర్తుకు చేసుకుంటారు. ఇలా ఇంట్లో వాళ్లవే కాదు, తెలిసినవాళ్ల చిన్నప్పటి చిత్రాల్ని చూడటమూ అందరికీ ఆసక్తికరంగానే ఉంటుంది. అలాంటిది తమ అభిమాన హీరోయిన్ల ఫొటోలు కనిపిస్తే- 'ఏదీ, అప్పట్లో ఎలా ఉన్నారు?, పోలికలు చూస్తే ఇట్టే గుర్తుపట్టొచ్చేమో' అనుకుంటూ ఫొటోల్ని కాస్త దగ్గరకు తీసుకుని ఒకటికి రెండుసార్లు పరిశీలిస్తుంటారు. ఈతరం మదిని దోచిన క్రేజీ హీరోయిన్లు... రష్మిక, శ్రీలీల, పూజా హెగ్డే, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్... ఇలా ఎందరో తారల చిన్ననాటి ఫొటోలు ఇక్కడున్నాయి. వీళ్లలో కొందరేమో అప్పుడూ ఇప్పుడూ అచ్చుగుద్దినట్టుగా ఒకేలా కనిపిస్తే, మరికొందరేమో 'అరె, అస్సలు గుర్తుపట్టలేనట్టుగా ఉన్నారే' అనిపిస్తుంది. కావాలంటే మీరూ ఓ లుక్కేసి, మీ అభిమాన చిన్నారి హీరోయిన్లను కనిపెట్టేయండి మరి!

1. రష్మిక 2. త్రిష 3. పూజా హెగ్డే 4. సాయి పల్లవి 5. అనుపమ పరమేశ్వరన్ 6. శ్రీలీల 7. జాన్వీ కపూర్ 8. శ్రుతి హాసన్ 9. కీర్తి సురేష్ 10. మృణాల్ ఠాకూర్ 11. అలియా భట్ 12. తాప్సీ 13. మీనాక్షి చౌదరి 14. అనుష్క 15. నిత్యా మేనన్

శరణు శరణు... శాంభవీ!



'అమ్మలగన్నయమ్మ... ముగురమ్మల మూలపుటమ్మ... చాలపెద్దమ్మ... సురారులమ్మ...' అంటూ ముల్లోకాలనూ పాలించే జగన్మాతను దేవీ శరన్నవరాత్రుల్లో ఎంతో శ్రద్ధాభక్తులతో ఆరాధిస్తాం. ఎంత పద్ధతిగా పూజ చేస్తున్నా కూడా, ఏవో సందేహాలు తొలుస్తూనే ఉంటాయి కదూ! రండి.. వాటిని నివృత్తి చేసుకోవడం, ఆ శక్తి స్వరూపిణి విశిష్టతనూ ఔన్నత్యాన్నీ తెలుసుకోవడంతో పాటు నవరాత్రి వేడుకల్లో అంగరంగవైభవంగా సాగే అమ్మవారి ఉత్సవాల విశేషాల్నీ చూద్దాం.



జగన్మాతను ఎలా పూజించాలి?



అసలు నవరాత్రి పూజ అంటే ఏమిటి?

ఏడాదిలో అయిదు నవరాత్రులు వస్తాయి. చైత్రమాసంలో - వసంత నవరాత్రులు, ఆషాఢంలో - వారాహి నవరాత్రులు, ఆశ్వయుజంలో - దేవీ శరన్నవరాత్రులు, పుష్యమాసంలో - శాకంబరీ నవరాత్రులు, మాఘమాసంలో - గోప్య లేదా గర్బ నవరాత్రులు. వీటిలో దేవీ శరన్నవరాత్రులు చాలా ప్రశస్తమైనవి. ఇవి ఆశ్వయుజ పాడ్యమి నుంచి నవమి వరకూ కొనసాగినా... హస్తా నక్షత్రం రోజున ఆరంభించి, శ్రవణా నక్షత్రం నాటికి పరిసమాప్తం చేయాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ ఏడాది పదిరోజులు రావడం విశేషం. కుదిరితే పదిరోజులూ చేయొచ్చు. లేదంటే, చివరి అయిదు లేదా మూడు రోజులు అమ్మవారిని పూజించొచ్చు.

☛ దేవి అలంకారాల్లో ఏ రూపాలను ప్రామాణికంగా తీసుకోవాలి?

శ్రీశైల భ్రమరాంబికా ఆలయం, వరంగల్ భద్రకాళి క్షేత్రం, శృంగేరీ శారదాపీఠం నవదుర్గల అలంకారంలో దేవీ భాగవతాన్ని అనుసరిస్తాయి. విజయవాడ కనకదుర్గ అమ్మవారి క్షేత్రంలో మూలవిరాట్టును గాయత్రి, బాలాత్రిపుర సుందరి, అన్నపూర్ణ... తదితర రూపాల్లో అలంకరిస్తారు. అందులో స్థానిక ఐతిహ్యాలూ పురాణకథలకు సంబంధించినవి కూడా ఉంటాయి. ఏ పద్ధతిని అనుసరించినా మనం కొలిచేది అమ్మనేనని మర్చిపోకూడదు.

☛ రోజుకో ప్రసాదం చేయాలనీ, రోజుకో రంగు చీరను దేవికి అలంకరించాలనీ అంటారు... నిజమేనా?

అది అపోహ మాత్రమే. దేవీ భాగవతంలో నవరాత్రికి సంబంధించిన నైవేద్యాలు మాత్రమే ఉన్నాయి. అవి కూడా నవదుర్గల అలంకారాలతో ముడిపడినవే. అక్కడా కట్టుపొంగలి, పులిహోర, గుడాన్నం వంటివే కనిపిస్తాయి. కాబట్టి, ఎవరి సౌకర్యాన్ని బట్టి వారు నైవేద్యాన్ని నివేదించొచ్చు. అమ్మ చూసేది నిశ్చయమైన భక్తినీ, నిర్మలమైన మనసునూ మాత్రమే.

☛ రోజంతా ఉపవాసం చేయాలా? ప్రత్యేక నియమాలేమైనా పాటించాలా?

నవరాత్రి పూజను ఆ ఇంటి ఆచారం ప్రకారం ఆరంభించాలి. కలశం, ఆర్చామూర్తి, చిత్రపటం, శ్రీచక్రం... ఇలా ఏ రూపాన్ని అయినా పూజించొచ్చు. జగన్మాతను ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం... ఇలా మూడు పూటలా పూజిస్తే మంచిది. కుదిరితే సాయంత్రం వరకూ ఉపవాసం ఉండి పూజ తర్వాత, భోజనం చేయొచ్చు. తొమ్మిది రోజులూ సాత్విక భోజనాన్ని స్వీకరిస్తూ, వస్త్రం పరుచుకుని శయనించాలి. పాదరక్షలు వేసుకోకూడదు. వీలైనంత మౌనాన్ని పాటిస్తూ 'శ్రీమాత్రే నమః' అంటూ అమ్మ నామాన్ని జపించాలి.

☛ ఈ సమయంలో చేసే కుంకుమపూజకు ఎందుకంత ప్రాధాన్యం?

కుంకుమ రజోగుణానికి ప్రతీక. ఉంగరం వేలు కూడా రజోగుణాన్ని ప్రతిబింబిస్తుంది. ఆ వేలితో కుంకుమ తీసుకుని అమ్మ ఆర్చా మూర్తినీ లేదా శ్రీచక్రాన్నీ పూజిస్తే... లౌకికమైన సంకల్పాలనూ దేవి నెరవేరుస్తుందన్నది నమ్మకం..

☛ ఈ సమయంలో ఉపదేశం తీసుకోకుండా లలితా సహస్రనామాన్ని చదవొచ్చా?

చదవకూడదు. అయితే, నవరాత్రి ఉత్సవాల్లో అందరితో కలిసి పారాయణ చేయొచ్చు. తండ్రి గురువుతో సమానం కాబట్టి, ఆయనకి మనసులోనే నమస్కరించుకుని లలితా సహస్రనామ పారాయణాన్ని చేయొచ్చు.

☛ నవరాత్రుల మధ్యలో నెలసరి వస్తే ఏం చేయాలి?

ఇబ్బంది లేదు. ఇతర కుటుంబసభ్యులు పూజను కొనసాగించొచ్చు. వాళ్లు ఆ ఇంటి ఇల్లాలి తరహాలోనే పూజా పద్ధతులు అనుసరించకపోయినా చింతించనక్కర్లేదు. ఎంత జగన్మాత అయినా అమ్మే కాబట్టి భయపడాల్సిన పన్లేదు.

☛ వివాహమైనా, భర్తకు దూరంగా ఉన్న మహిళల్ని సువాసినులుగా పూజించొచ్చా?

నవరాత్రులు మహిళా సాధికారతకూ, శక్తికీ ప్రతీక. స్త్రీ అంటేనే శక్తి స్వరూపం. లలితా నామాలను గమనిస్తే, ఒకచోట శివదూత్యై నమః అని ఉంటుంది. అంటే.. అమ్మవారు మహిషుని సంహరించేందుకు తన భర్త అయిన పరమేశ్వరుడినే దూతగా పంపి.. యుద్ధానికి ఆహ్వానిస్తుంది. కాబట్టి, సాటి మహిళను శక్తిస్వరూపంగా భావించి పూజలకూ ఆహ్వానించొచ్చు. ఈ ఉత్సవాలన్నీ... ఆత్మవిశ్వాసాన్నీ మనోబలాన్నీ విశ్వమానవ శాంతినీ పెంచేవే. అమ్మను ఆరాధించే విషయంలో ఎలాంటి అపోహలకూ, భేషజాలకూ తావు ఇవ్వకూడదు.

– ఆచార్య కాకునూరి సూర్యనారాయణమూర్తి, ప్రవచన కర్త

శక్తి స్వరూపిణి... జ్యోతి రూపంలో!



ఆలయాల్లో దేవతామూర్తులు విగ్రహాల రూపంలో దర్శనం ఇవ్వడం చూస్తుంటాం. కానీ, జ్వాలాముఖి ఆలయంలో జగన్మాత జ్యోతి రూపంలో కొలువుదీరి పూజలు అందుకోవడం విశేషం. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ క్షేత్రం హిమాచల్‌ప్రదేశ్, కాంగ్రా జిల్లాలో ఉన్న కాళీధర్ శిఖరంపైన ఉంది. ఎలాంటి నూనే లేకుండానే ఈ ఆలయంలోని జ్యోతి తొమ్మిది చోట్ల సహజంగా వెలుగుతూ కనిపిస్తుంది. యాభైఒక్క శక్తిపీఠాల్లో ఒకటిగా ప్రసిద్ధిగాంచిన ఈ గుడిలో... దక్షయజ్ఞ సమయంలో సతీదేవి నాలుక పడిందని ప్రతీతి. వందల సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ ఆలయాన్ని రాజా భూమి చంద్ అనే పాలకుడు నిర్మించాడట. ఈ జ్వాలలు ఎలా వస్తున్నాయనేది తెలుసుకునేందుకు ఎంతోమంది శాస్త్రవేత్తలు ప్రయత్నించారు. అందరూ విఫలమయ్యారు. ఆ జ్వాలలు పట్టణాన్ని కాల్చేస్తాయనే భయంతో అక్బర్ చక్రవర్తి వాటిని ఆర్పేందుకు ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదట. దీంతో అమ్మవారి మహిమను గుర్తించి, ఆలయానికి బంగారు గొడుగును కానుకగా అర్పించాడట. ఇక్కడ నవరాత్రి ఉత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతాయి. అఖండ జ్యోతిని చూసేందుకే భక్తులు దేశం నలుమూలల నుంచీ వస్తారు.

అలంకారానికో ప్రత్యేకత

సమస్త జగత్తునూ పాలించే ఆ శక్తిస్వరూపిణిని పలు రూపాల్లో కొలిచే వేడుకే దసరా. ఆ అలంకారాల ప్రత్యేకత తెలుసుకుందామా...

★ **బాలాత్రిపురసుందరి:** అమ్మవారిని తొమ్మిదేళ్ల బాలికగా భావించి ఉపాసిస్తారు. జ్ఞానానికీ, శక్తికీ చిహ్నం. శత్రువులను నిర్మూలించి, ఆరోగ్యాన్నీ ధనాన్నీ ప్రసాదించే రూపం. భండాసురుడు అనే అసురుడి పుత్రులతో పోరాడేందుకు జగన్మాత ఇలా బాలిక రూపాన్ని దాల్చిందని బ్రహ్మాండ పురాణంలోని లలితాదేవి మహాత్మ్యంలో ఉంది.

★ **గాయత్రీదేవి:** గయలు అంటే ప్రాణాలు, త్రాయతే అంటే రక్షించేదని అర్థం. అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానాన్నీ, మానసిక ప్రశాంతతనూ, మహదానందాన్నీ ప్రసాదిస్తుంది.

★ **అన్నపూర్ణాదేవి:** అన్న అంటే ఆహారం లేదా ధాన్యం అనీ... పూర్ణ అంటే పూర్తి, సంపూర్ణం అనీ అర్థం. సాక్షాత్తూ పరమశివుడికే ఆహారాన్నీ జ్ఞానభిక్షనూ ప్రసాదించిన అన్నపూర్ణను కొలిస్తే ఆహారానికీ, జ్ఞానానికీ లోటు ఉండదట.



★ **కాత్యాయినీదేవి:** పార్వతికి మరో పేరు. మహిషాసుర సంహారం సమయంలో పార్వతీదేవికి సాయం అందించింది కాత్యాయినీ దేవేనని స్కందపురాణం పేర్కొంటోంది.

★ **మహాలక్ష్మి:** సంపదకూ, ఐశ్వర్యానికీ అధిదేవత. అష్టలక్ష్ములుగా ఎనిమిది రూపాల్లో కరుణిస్తూ ఐశ్వర్యాన్నీ, ఆనందాన్నీ విజయాలనూ అందించే వరప్రదాయిని.

★ **లలితా త్రిపురసుందరీదేవి:** శ్రీచక్రానికి అధిదేవత. ముల్లోకాలనూ పాలిస్తూ త్రిగుణాతీతమైన రూపంలో ప్రకాశిస్తూ తనని కొలిచే భక్తులను ఎల్లవేళలా రక్షిస్తూ ఉంటుంది.

★ **మహాచండీదేవి:** దుర్గాదేవికి మరో శక్తిమంతమైన రూపం. భక్తులకు విజయాన్నీ, కీర్తినీ ప్రసాదించేందుకు అవతరించింది. ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తుల కలయిక. అడ్డంకుల్ని తొలగించి, అనుగ్రహాన్ని అందిస్తుంది.

★ **మహాసరస్వతి:** జ్ఞానం, విద్య, కళలకు అధిదేవత.

★ **దుర్గాదేవి:** సింహవాహినిగా అవతరించి, లోకమాతగా పూజలు అందుకునే రూపం.

★ **మహిషాసురమర్దిని:** దుష్టశిక్షణ, శిష్టరక్షణతో లోకాలను సుఖశాంతులతో విలసిల్లేలా చేస్తుంది. మహిషుడిని సంహరించిన పరమపావని. అమ్మను సేవిస్తే ఆపదలూ, భయాలూ తొలగిపోతాయి.

★ **రాజరాజేశ్వరి:** కరుణామయి. అన్ని లోకాలనూ పాలిస్తూ సృష్టి-స్థితి-లయలను నియంత్రించే సర్వశక్తిమంతురాలు.

అమ్మవారికీ మేకప్ ఆర్టిస్టులు



వినాయకుడి మాదిరిగానే, నవరాత్రుల సమయంలోనూ అమ్మవారిని పందిళ్లలో ఏర్పాటు చేయడం... ఆ తర్వాత ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేయడం పరిపాటి. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు అమ్మవారి పందిళ్ల సంఖ్యా బాగా పెరిగిందనే చెప్పాలి. వేడుకల్లో భాగంగా అమ్మవారిని రోజుకో రూపంలో ముస్తాబు చేయడం అంటే మాటలు కాదు. అందుకే... దేవి విగ్రహాన్ని అందంగా అలంకరించేందుకు ప్రత్యేకంగా మేకప్ ఆర్టిస్టులూ వచ్చారు. వీళ్లు అమ్మవారికి చీరను ధరింపచేయడం నుంచీ ఆరోజు కొలిచే రూపానికి తగినట్లుగా కేశాలంకరణ చేయడం, కనుబొమలు దిద్దడం, చీరకు తగిన నగలు వేయడం, మేకప్ అద్దడం... ఇలా అన్నీ చేస్తున్నారు.

దసరా సవారీకి ఏనుగులు సిద్ధం!

దేశంలోనే దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలకు ప్రసిద్ధి మైసూరు. తొమ్మిది రోజుల పాటు కోలాహలంగా జరిగే ఈ ఉత్సవాలు విజయదశమి రోజున జంబూ సవారీతో ముగుస్తాయి. ఆ సవారీలో పాల్గొనే ఏనుగులే ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణ. నవరాత్రికి దాదాపు రెండు నెలల ముందుగా వాటి బరువు, వయసు, శారీరక దృఢత్వం వంటివన్నీ పరిశీలించి ఎలాంటి ఆరోగ్య సమస్యలూ లేని పద్నాలుగు ఏనుగులను 'గజపయన'కు ఎంపిక చేస్తారు. ఒక్కోదానికి ఇద్దరు చొప్పున మావటీలను సంరక్షకులుగా నియమిస్తారు. అలా అడవుల నుంచి మైసూరు మహానగరంలోకి అడుగుపెట్టే గజరాజుల్ని 15 మంది నిపుణుల బృందం అనుక్షణం పర్యవేక్షిస్తుంది. చురుగ్గా ఉండటానికి... ఒక్కో ఏనుగుకీ రోజూ రాగి ముద్దతోపాటు ఉలవలు, మినుములు, పెసలు, వేరుశెనగలు, గోధుమలు, బియ్యం, ఉల్లి, కొబ్బరి, బెల్లం, చెరకు... ఇలా రకరకాల ఆహారపదార్థాల్ని నాలుగు నుంచి ఆరువందల కిలోల వరకూ పెడతారు. ఆ తర్వాత మైసూరు ప్యాలెస్ నుంచి బన్నీ మంటపం వరకు నడిపిస్తూ ప్రాక్టీస్ చేయిస్తారు. ఏనుగుల కాళ్లకు గాయాలు కాకుండా రోడ్లనూ శుభ్రం చేస్తారట. వేడుక సమయంలో- పెద్ద శబ్దంతో వినిపించే సంప్రదాయ సంగీతం, డీజే పాటలు, జనాల అరుపులకు బెదరకుండా ప్రత్యేక శిక్షణా ఉంటుంది.





కథ

ఉడత సాయం


– పూర్ణిమ పెమ్మరాజు

"ఇంకెంత టైం పడుతుంది?" ఫ్లైట్ దిగిన గంటలో అప్పటికి నాలుగోసారి అడుగుతున్న మూర్తికేసి ఆశ్చర్యంగా చూశాడు రాజేష్.

"ఇంకో గంటలో వెళ్ళిపోతాం సార్, ముందుకెళ్ళి కత్తిపూడి దగ్గర రైట్ తీసుకుంటే కోనసీమలోకి వెళ్ళిపోతాం. లోపలికి వెళ్ళాక సుమారుగా ఒక అరగంటలో వెళ్ళిపోతామండీ రోడ్డు బాగుంటే" డ్రైవర్ ఓపిగ్గా చెప్పాడు సమాధానం.

"సర్, ముందొచ్చే రెస్టరెంట్ దగ్గర కాస్త ఫ్రెష్ అవుతారా, ఎర్లీ మార్నింగ్ స్టార్ట్ అయి ఉంటారు ఎయిర్‌పోర్ట్‌కి రావడానికి. దిగుతూనే రోడ్డు జర్నీ, రాజమండ్రిలో మా ఇంట్లో కాసేపు ఆగి లంచ్ తిని వెళ్దామన్నా మీరు వినలేదు. కనీసం మా ఇంటికి కూడా రాలేదు" కొంచెం కినుకగా అంటున్న రాజేష్‌ని చూసి చిరునవ్వు నవ్వాడు మూర్తి.

"ఎందుకు రానోయ్ మీ ఇంటికి. నువ్వు చేసిన ఉపకారానికి ఎలా థాంక్స్ చెప్పాలో కూడా తెలీట్లేదు. ఇప్పుడు నువ్వు కనుక్కున్న అడ్రస్‌లో ఉన్న వాళ్ళని, నేను ఎన్ని సంవత్సరాల నుంచి వెతుకుతున్నానో తెలుసా... అందుకే, నువ్వు



ఈ డిస్ట్రిక్ట్‌కి జాయింట్ కలెక్టర్‌గా ఉన్నావు అని తెలియగానే నీకు కాల్ చేసి హెల్ప్ అడిగాను. నువ్వు నన్ను నిరాశ పరచలేదు. వారంలో నేను ఇచ్చిన డీటెయిల్స్‌తో వాళ్ళ అడ్రస్ కనుక్కున్నావు. ఒక్కసారి అక్కడికి వెళ్ళి, వాళ్ళని కలిశాక- మీ ఇంటికి వచ్చే నేను మా ఇంటికి వెళ్తాను, సరేనా. అయితే ఒకసారి వెళ్ళి చూసేదాకా నాకు ఆత్రుత ఆగదు" ఆప్యాయంగా తన పూర్వ విద్యార్థిని చూస్తూ వివరణ ఇచ్చాడు మూర్తి.

"అయ్యో, మీరు నాకు థాంక్స్ చెప్పడం ఏమిటి సర్, నేను ఇప్పుడు ఇలా ఉన్నా అంటే అది మీవల్లే కదా. మీరు చెప్పిన డీటెయిల్స్‌తో రికార్డులు అన్నీ తీయించి అడ్రస్ అయితే కనుక్కున్నా కానీ వెళ్ళి చూస్తే తప్ప, అక్కడ ఉన్నది మీరు అనుకున్న వాళ్ళా కాదా అని తెలీదు, అందుకే నాకు కొంచెం టెన్షన్‌గా ఉంది. ఇంతకీ ఎవరు సర్ ఆవిడ, మీకేమవుతారు? అడ్రస్ దొరికింది అనగానే, 'ఇంపార్టెంట్ మీటింగ్' అని ఢిల్లీ వెళ్ళిన మీరు అది కూడా క్యాన్సిల్ చేసుకుని ఇంత అర్జెంటుగా వచ్చారంటే... మీకు బాగా కావలసినవాళ్ళా..?" రాజేష్ ప్రశ్నకి మూర్తి మనసు యాభై సంవత్సరాల వెనక్కి పరుగు తీసింది.

★ ★ ★

"ఈ అబ్బాయి ఎవరు... తన చేత నీళ్ళు తోడిస్తున్నావెందుకు?" అడిగింది కస్తూరి, వీరమ్మని. బావిలో నుంచి నీళ్ళు తోడుతున్న పది సంవత్సరాల పిల్లాడిని చూస్తూ.

"నా పెద్ద గుంటడు సూరిగాడు అమ్మా, ఇంట్లో ఉండరా అయ్యా అంటే వినకుండా ఊరి బయట పోరంబోకులతో కలిసి ఈత కొడుతున్నాడు. ఆల్లంత సరైనోళ్ళు కాదు. చీట్లపేకా, బీడీ అన్నీ- ఈడికి మప్పేస్తారేమో అని బయమేసి నాతో పనికి తెచ్చుకుంటున్నా, కనీసం సాయం ఉంటాడని. ఈ రెండేళ్ళు పోతే మునసబుగారు జీతగాడిగా పెట్టుకుంటామన్నారు. అందాకా ఈడిని కాపలా కాయాల నేను. మా ఆయనేమో పొలం పనులకి పోతే మాపటికి గానీ రాడు. ఈడికన్నా చిన్న పిల్లలిద్దరితో బెంగేటి నేదు. ఆల్లు బానే ఇంటి దగ్గర ఆడుకుంటారు. ఈ గాడిదతోనే చిక్కయిపోనాది" గిన్నెలు తోముతూ చెప్పుకుపోతోంది వీరమ్మ.

"అదేంటి వీరమ్మా, పిల్లాడిని బడికి పంపొచ్చు కదా... ఈ పనుల్లో పెట్టడం ఎందుకు ఇప్పటి నుంచే" ఇంటి దగ్గర ఉన్న తన చిన్న తమ్ముడు గుర్తొచ్చి కలుక్కుమంది కొత్తగా పెళ్ళి అయి కాపురానికి వచ్చిన కస్తూరికి.

"బళ్ళో ఏసినానమ్మా, కానీ పోడు బడికి. ఈ ఊరికీ పక్కూరికీ కలిపి మధ్యలో బడి ఉంది. ఐదో కళాసు దాకా ఉన్నాది. ఈడిని నాలుగు దాకా అక్కడికి ఎలాగో అలా పంపాను. అక్కడికి పోడు, ఎల్లినా సదవట్లేదని అయ్యోరు కొట్టారని వచ్చేశాడు. మళ్ళీ పోలేదు. అయినా మా వోల్లు ఎవరూ పోరు బళ్ళోకి. మాకెందుకమ్మా ఈ సదువు. ఎక్కడోక్కడ పన్లో ఎడితే ఆడి సావు ఆడు సస్తాడు."

ఇంకా పసితనం పోని సూరి మొహం చూస్తే జాలేసింది కస్తూరికి.

"పోనీ, ఒక పని చెయ్యి, నా దగ్గర ఉంచు వాడిని, అయ్యగారు పొద్దున్న వెళ్తే ఎప్పుడు వస్తారో తెలీదు. నాకు ఈ కొత్త ఊరులో ఒక్కదాన్నే ఉండాలంటే గుబులుగా ఉంది. నాకు తోడుగా ఉంటాడు పొద్దున్న నుంచి సాయంత్రం దాకా, ఏరా ఉంటావా ఇక్కడ" అడిగింది కస్తూరి.

"ఓ, ఉంటా. అమ్మా, నేను ఇక్కడ ఉంటానే, ఇక్కడ కరెంటు బల్బ్ ఉంది, రేడియో పెట్టె ఉంది, పాటలు వస్తాయంటే అందులో, అమ్మా నన్నిక్కడ ఉండనియ్యా" వేడుకోలుగా అడిగాడు సూరి.

"మీ దగ్గర ఉంటా అంటే నాకేం బాధమ్మా, మీ పున్నెమా అని కాస్త మంచి బుద్ధి వస్తే అదే చాలు. నా పని అయింది. నేను ఇంటికి పోతున్నా, ఒరేయ్ నువ్వేం యాగీ సెయ్యకుండా సక్కగా ఉండాల" సూరికి జాగ్రత్త చెప్పి వెళ్ళిపోయింది వీరమ్మ.

"అమ్మగారూ, నన్నేం పని చెయ్యమంటారు. చెప్పండి, చిటికలో చేసేస్తాను. తరువాత రేడియో పెట్టెలో పాటలు వచ్చినప్పుడు నాకు వినిపిస్తారా" ఆశగా అడుగుతున్న సూరిని చూసి చిరునవ్వు నవ్వింది.

"నువ్వేం చెయ్యక్కర్లేదు, రేడియోలో పాటలు అప్పుడే రావు ఇంకా టైమ్ ఉంది. ఈలోపు నేను ఒక కథ చెప్పనా, వింటావా?!"

"ఓ, కథా, చెప్పండి... నాకు చాలా ఇష్టం కథలు"

"ఒక అడవిలో ఒక సింహం ఉండిట. ఆ అడవికి అదే రాజు. దానికి ఎవరూ ఎదురు చెప్పకూడదు. తనకన్నా బలవంతులు ఎవరూ లేరని దానికి మహా గర్వం. ఆ అడవిలో కనిపించిన ప్రతి జంతువునీ తినేస్తుందిట. అన్నిటికీ అదంటే భయం. ఒకసారి దానికి ఒక కుందేలు ఎదురుపడింది. సింహాన్ని చూడగానే కుందేలుకి అర్థమైంది- తనకి చావు మూడిందని. కానీ తెలివిగా ఆలోచన చేసి, అదే సింహం దగ్గరకు వెళ్ళి, 'నమస్కారం రాజుగారూ, అమ్మయ్య... మీరు కనిపించారు. నేను చస్తే మీ చేతిలోనే చావాలని మీ దగ్గరకే పరిగెత్తుకొస్తున్నాను' అని చెప్పిందిట. సింహానికి అర్థం కాలేదు. 'అదేమిటీ, నా చేతిలో చావడం కోసం రావడం ఏమిటీ' అని అడిగింది. 'ఇన్నాళ్ళ నుంచీ- మాకు రాజు మీరు. ఇక్కడ అందరికన్నా బలవంతులు. కానీ, కొత్త సింహం వచ్చి నేనే మీ రాజుకన్నా బలవంతుడిని అందండీ. దాని నుంచి తప్పించుకుని మీ దగ్గరకే పారిపోయి వస్తున్నా' అని చెప్పింది. అది విని సింహానికి కోపం వచ్చింది. 'నాకన్నా బలవంతులు ఎవరు ఇక్కడ, నాకు చూపించు. నేను చంపేస్తాను' అని రంకెలేసింది. అప్పుడు కుందేలు నుయ్యి దగ్గరకి తీసుకెళ్ళి, 'చూడండి, ఇందులో ఉంది' అని చూపించింది. సింహం వంగి చూస్తే తన ప్రతిబింబమే కనిపించింది. కానీ దానికి తెలీక అది వేరే సింహం అనుకుని దాన్ని చంపేద్దామని ఎగిరి నూతిలోకి దూకి చచ్చిపోయింది. అడవిలో జంతువులన్నీ ఆనందంతో పండగ చేసుకున్నాయి. ఇంత తెలివైనదానివి, నువ్వే రాజుగా ఉండమని కుందేలునే రాజుని చేశాయి."

"కథ ఎలా ఉంది?" అడిగింది కస్తూరి.

"బాగుంది అమ్మగోరూ."

"ఒక ప్రశ్న అడుగుతా చెప్పు. 'నూతిలో పడితే చచ్చిపోతాన'ని సింహానికి తెలీదుకానీ, కుందేలుకి తెలుసు... ఎలా?" కస్తూరి ప్రశ్నకి తెల్లమొహం వేసి బుర్ర అడ్డంగా ఊపాడు సూరి.

"ఎలా అంటే... కుందేలు చక్కగా బడికి వెళ్ళి చదువుకుంటోంది. అందుకని దానికి తెలుసు. సింహం చదువుకోలేదు, అందుకే దానికేం తెలీదు" కస్తూరి మాటలకి పకపకా నవ్వాడు సూరి.

"కుందేలు బళ్ళోకి వెళ్తుందన్నమాట, ఇంకో కథ చెప్తారా ఇలాంటిది" ఆశగా అడిగాడు సూరి.

"ఇప్పుడు నాకు వంట చేసుకునే పని ఉంది. నువ్వో పని చెయ్యి... ఈ పుస్తకంలో ఇలాంటి కథలు చాలా ఉన్నాయ్. చదువుతూ ఉండు. ఎక్కడన్నా అర్థంకాకపోతే అడుగు- నేను చెప్తాను. 'పంచతంత్రం' బొమ్మల పుస్తకం తెచ్చి ఇచ్చింది.

"నాకు చదవడం బాగా రాదమ్మా."

"నాలుగు దాకా బడికి వెళ్ళావంటే అ, ఆలూ గుణింతాలూ వత్తులూ వచ్చే ఉంటాయి కదా."

"సరిగా రావు" సిగ్గుగా తల దించుకున్నాడు సూరి.

"పర్లేదు, ఇప్పుడు నీకేం పరీక్ష కాదుగా ఇది. కూడబలుక్కుంటూ ఎంత వస్తే అంత చదువు. అస్సలు తెలీకపోతే నన్ను అడుగు చెప్తా. ఒక కథ చదివి చూడు. నీకెంత అర్థం అయిందో నాకు చెప్పు. అర్థం కానిది నేను చెప్తా" చాలా అనునయంగా చెప్పిన కస్తూరి మాటలకి ఉత్సాహంగా తలూపి పుస్తకం అందుకున్నాడు సూరి.

★ ★ ★

"ఏంటోయ్... ఈ పిల్లలూ హడావుడీ. వాళ్ళకి ప్రైవేట్ చెప్తున్నావా ఏమిటీ?" వరండాలో ఉన్న నలుగురు పిల్లల్నీ చూస్తూ అడిగాడు భానుమూర్తి కస్తూరిని.

"అబ్బే... అదేం లేదండీ. సూరి కాస్త కథలు చదవడం నేర్చుకున్నాడు కదా ఈ పదిహేను రోజుల నుంచీ. తన స్నేహితులందరికీ చెప్పినట్టు ఉన్నాడు, వాళ్ళు ఆ కథలు వింటామని వచ్చారు. వీడు చదివి వినిపిస్తున్నాడు వాళ్ళకి" నవ్వుతూ చెప్పింది కస్తూరి.

"బడికి వెళ్ళాల్సిన పిల్లలు, మానేసి ఇలా కాలం గడుపుతున్నారు" బాధగా అన్నాడు భానుమూర్తి.

"చాలాసార్లు చెప్పానండీ బడికి పంపమని. పిల్లలకి ఇష్టం లేదు, తల్లిదండ్రులకి చదువు విలువ తెలీదు. కనీసం ఈ కథల కాలక్షేపం కోసం అయినా... చదవడం, రాయడం నేర్చుకుంటారేమో అని ఏదో ఒక ప్రయత్నం... నాకూ కాలక్షేపం. వాళ్ళకి రెండు ముక్కలు వస్తే మంచిదేగా" అంది కస్తూరి.

★ ★ ★

"మనం నాటకం వేస్తామా అమ్మగారూ, నిజమా" ఆశ్చర్యంగా అడిగాడు సూరి.

"అవును సూరీ. నువ్వూ, చదవడం వచ్చిన ఇంకో ఇద్దరు స్నేహితులూ కలిసి నాటకం వేద్దురుగానీ. మీరు చదివే కథలే నాటకంగా వేద్దాం. ఈసారికి నేను మాటలు రాస్తాను. వచ్చేసారి నుంచి మీరే రాయాలి వాటిల్లో డైలాగ్స్. ఇలా వెయ్యడం వలన చదవడం రాని పిల్లలకిగానీ మీ అమ్మ లాంటి పెద్దవాళ్ళకి కానీ సులువుగా అర్థమవుతుంది కథ, సరేనా" కస్తూరి మాటలు విన్న పిల్లల ఆనందానికి హద్దులు లేవు.

"అమ్మగారూ, మేము చదవడం నేర్చుకుంటే మా చేతా వేయిస్తారా నాటకం" ఉత్సాహంగా అడుగుతున్న పిల్లల్ని చూసి పొంగిపోయింది కస్తూరి.

"తప్పకుండా, కానీ మీకు బాగా చదువు రావాలంటే మీరంతా బళ్ళోకి వెళ్ళాలి. అయ్యగారు వెళ్ళి బళ్ళో మాస్టారుతో మాట్లాడతారు. మీరు పొద్దున్న అక్కడికి వెళ్ళి సాయంత్రం నా దగ్గరికి రండి. అలా అయితే ప్రతి వారం మన అరుగు మీదే చిన్న నాటకం వేసుకుందాం. ఎవరెవరు శ్రద్ధగా బళ్ళోకి వెళ్ళి చదువుతున్నారో చూసి, నెలకి ఒకళ్ళకి చిన్న బహుమతి ఇస్తాను."

సూరి తప్ప, పిల్లలంతా ఉత్సాహంగా తలూపారు.

"నేను వెళ్ళనమ్మగారూ, నేను మీ దగ్గరే ఉంటాను. నాకు చదివి ఉద్యోగం చెయ్యడం నచ్చదు. నేను గేదెలు కాసుకుంటా, నాకు అదే ఇష్టం" మొండిగా అన్నాడు సూరి.

"చదువు ఉద్యోగం కోసం కాదు సూరీ... జ్ఞానం కోసం. నువ్వు గేదెలే పెంచాలనుకున్నా కూడా ఆ పని ఇంకా ఎంత బాగా చెయ్యాలో



తెలుసుకోవడం కోసం. నీ జీవితం సుఖంగా ఉండాలంటే కనీస చదువు అవసరం. చదవడం, రాయడం, రోజువారీ లెక్కలు చూసుకోగలిగేంత చదువు అన్నా లేకపోతే చాలా ఇబ్బంది అవుతుంది. నిన్ను ఎవరన్నా సులువుగా మోసం చేయగలుగుతారు. నీలో చాలా తెలివితేటలు ఉన్నాయి సూరీ. ఏదైనా ఒక్కసారి చెప్తే పట్టేస్తావు. నీ తెలివికి చదువు తోడైతే నువ్వు బాగా పైకెళ్తావు అనిపిస్తోంది నాకు. నాకోసం అయినా నువ్వు బడికి వెళ్ళాలి" ఆప్యాయంగా చెప్తున్న కస్తూరి మాటలు కాదనలేక అయిష్టంగానే తలూపాడు సూరి.

★ ★ ★

"అమ్మగారూ, మీరు ఊరెళ్ళిపోతున్నారా?" ఏడవ తరగతి పరీక్షలు అయిపోయి వేసవి సెలవలు అంతా కస్తూరితో గడపొచ్చనుకున్న సూరికి- భానుమూర్తికి బదిలీ అయి కస్తూరి వాళ్ళు వెళ్ళిపోతారన్న వార్త పిడుగులాగా తగిలింది.

"అయ్యగారికి బదిలీ అయింది కదా, వెళ్ళాలి మరి, నువ్వు మాత్రం నాకు ఇచ్చిన మాట తప్పకూడదు. బడికి వెళ్ళాలి. వచ్చే ఏడు సెలవులు ఇచ్చినప్పుడు నా దగ్గరకి వద్దువుగాని, ఉత్తరాలు రాస్తాను నేను. నువ్వు కూడా రాయి. ఛ, అలా ఏడవకూడదు" సూరి కన్నీళ్ళు తుడిచింది కస్తూరి.

"నిజంగా ఉత్తరాలు రాయాలి మరి." తలూపింది కస్తూరి.

★ ★ ★

కస్తూరి వెళ్ళిన నెల తరవాత ఉత్తరం వచ్చింది సూరికి. ఆత్రంగా చదవడం మొదలెట్టాడు.

"ప్రియమైన సూరికి,

ఆశీస్సులతో కస్తూరి రాయునది. నువ్వు క్షేమంగా ఉన్నావని తలుస్తాను. మేము ఇక్కడికి చేరుకుని, ఇల్లు వెతుక్కుని సర్దుకోడానికి సమయం పట్టింది. అందుకే వెంటనే ఉత్తరం రాయలేకపోయాను. పోయిన వారం మీ బడిలో పనిచేసే మాస్టారుగారు అయ్యగారికి ఒక పెళ్ళిలో కలిశారట. అయ్యగారు నీ గురించి అడిగితే, 'నువ్వు ఇదివరకు అంత హుషారుగా, శ్రద్ధగా చదవట్లేదు' అని చెప్పారట. అందుకే వెంటనే ఉత్తరం రాస్తున్నాను. నువ్వు నాకు మాట ఇచ్చావు బడికి వెళ్తా అని. కానీ వెళ్ళి చదువు మీద శ్రద్ధ పెట్టకపోతే ఏం ఉపయోగం చెప్పు. నాకు తెలుసు- నువ్వు ఉద్యోగం చెయ్యడం కోసమే చదువు అనుకుంటున్నావని, కాదు సూరీ... ఇదివరకు కూడా చెప్పాను, చదువు జ్ఞాన సముపార్జన కోసం. నువ్వు చదువుతూ ఉంటేనే నీకు ఏ విషయం మీద ఆసక్తి ఉందీ, ఏది నీకు ఉపయోగకరమైనదీ తెలుస్తుంది. అసలు నీకు చదువు కావాలా వద్దా అని నువ్వు నిర్ణయించుకోడానికి అయినా నీకు కనీస చదువు కావాలి. నాకు 'మాట ఇచ్చా కాబట్టి' అని కాకుండా శ్రద్ధగా చదవడానికి ప్రయత్నించు. కొత్త విషయాలు తెలుసుకోవడంలో ఉన్న ఆనందం నీకే అర్థమవుతుంది.

ఇంకో విషయం సూరీ, మీ గూడెంలో ముందు నువ్వు నా దగ్గరకి వచ్చి కథల పుస్తకాలు చదవడం మొదలెట్టగానే ఇంకో పదిమంది నిన్ను చూసి వచ్చారు. వాళ్ళని చూసి ఇంకొంతమంది... ఇంతమందికి చదువు మీద ఆసక్తి కలగడానికి నువ్వే కారణమయ్యావు. మీ అందరూ కలిసి ఇదివరకులానే ప్రతీ వారం చిన్న నాటకం వెయ్యండి. మీరు ఇన్నాళ్ళూ చదివిన పంచతంత్రం, నీతి కథలు, బాల రామాయణం, బాల భారతం... అన్నీ మీ మాస్టారుగారికి ఇచ్చి పంపిస్తున్నా. ప్రతి వారం అందులోనుంచి ఏదో ఒక కథ తీసుకుని ప్రయత్నించండి. వినోదంతోపాటు అందులో చదువు ప్రాముఖ్యత ఏదో ఒక రకంగా తెలిసేలా ప్రయత్నించండి. అప్పుడు నీతోపాటు అందరూ బాగా చదువుకుంటారు.

మరి నేను ఉంటాను. నేను డెలివరీకి మా అమ్మా వాళ్ళింటికి వెళ్తున్నాను. కొన్నాళ్ళు ఉత్తరం రాయలేకపోవచ్చు. కానీ, నా ఆశీస్సులు ఎప్పుడూ నీతో ఉంటాయి. నువ్వు జీవితంలో బాగా పైకి రావాలనీ పేరు ప్రఖ్యాతులు సంపాదించాలనీ దీవిస్తూ...

కస్తూరి

★ ★ ★

"ఇప్పుడు అర్థమైంది సర్, మీరెందుకు ఇంత

ఉద్వేగంగా ఉన్నారో" ఉత్తరం చదివిన రాజేష్ అన్నాడు.

"ఈ ఉత్తరం తరవాత అయ్యగారికి మళ్ళీ ట్రాన్స్‌ఫర్ అయింది. అక్కడ నుంచి వాళ్ళతో కాంటాక్ట్ మిస్ అయింది. వేరే స్టేట్‌కి ట్రాన్స్‌ఫర్ వచ్చి వాళ్ళు వెళ్ళిపోయారట. వాళ్ళని కలవాలని చాలా ట్రై చేశాను. చివరకి నీ పుణ్యమా అని కలుస్తున్నాను" అభిమానంగా చూస్తూ చెప్పాడు మూర్తి.

"అయ్యో సర్, భలేవారే, మీకు ఈ రకంగా అన్నా ఉపయోగపడ్డాను... అదే చాలు నాకు. అదిగో ఇల్లు వచ్చేసింది. మీతోపాటు నాకు కూడా ఆవిడని కలవాలని అంతే ఆత్రంగా ఉంది" కారు దిగుతూ చెప్పాడు రాజేష్.

★ ★ ★

"నిజంగా, మా సూరివేనా నువ్వు... సారీ, మీరు..." కస్తూరికి ఆశ్చర్యానందాలతో మాట తడబడుతోంది.

"నన్ను 'మీరు' ఏమిటి అమ్మగారూ, ఇదివరకులాగా 'ఏరా' అనండి."

ఖరీదైన కారులో సూటూబూటూ వేసుకుని దిగిన సూర్యనారాయణని చూస్తుంటే ఆనందం పొంగుకొచ్చింది కస్తూరికి.

"ఎంత పెద్దవాడివయ్యావురా, మీ అయ్యగారే ఉంటే ఎంత సంతోషించేవారో, నిన్ను చూస్తుంటే నాకెంత ఆనందంగా ఉందో మాటల్లో చెప్పలేను. మీ అమ్మ ఎలా ఉంది, ఏం చేస్తున్నావు నువ్వు?"

"మీరు వీకే ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ గురించి టీవీలో పేపర్‌లో చూసే ఉంటారు కదా... అవి నావేనమ్మగారూ. 'వీకే' అంటే 'వీర కస్తూరి ఇన్‌స్టిట్యూట్.' మా అమ్మ పేరూ మీ పేరూ కలిపి పెట్టాను. దేముడి దయ, మీ ఆశీర్వాదంతో అది టాప్ ఇన్‌స్టిట్యూట్‌గా మారింది. మన రెండు తెలుగు రాష్ట్రాలలో చాలాచోట్ల మన బ్రాంచెస్ ఉన్నాయి. అన్నట్టు... డెయిరీ ఫామ్ కూడా పెట్టా అమ్మగారూ, చిన్నప్పుడు గేదెలు కాచుకుంటా అనేవాడిని కదా" నవ్వుతూ చెప్పిన సూరిని ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయింది కస్తూరి.

"మీ గురించి ఏం చెప్పలేదు అమ్మగారూ... ఎలా ఉన్నారు, పిల్లలూ అయ్యగారూ..." అర్థోక్తిగా ఆపాడు సూర్యనారాయణ.

"ఆయన వెళ్ళిపోయి ఐదేళ్ళు అయింది. ఇద్దరు పిల్లలు విదేశాలలో ఉన్నారు. తమ దగ్గరే ఉండమంటారు కానీ, నాకు ఈ ఇల్లూ ఈ ఊరూ వదిలి వెళ్ళాలని లేదు. అందుకే ఇక్కడే కాలక్షేపం చేస్తున్నాను. పక్క వాటా అద్దెకి ఇచ్చాను. వాళ్ళు మంచివాళ్ళు, తోడుగా ఉంటారు. ఈ చుట్టుపక్కల అందరూ నాకు బాగా అలవాటు. అందుకని నాకు ఇక్కడే బాగుంటుంది" నవ్వుతూ చెప్పింది కస్తూరి.

"ఈ పిల్లలు..." టీవీ చూస్తున్న నలుగురు పిల్లలని చూసి అడిగాడు సూర్యనారాయణ..

"వీళ్ళ అమ్మలు పొలం పనులకి వెళ్తారు. ఈ పక్కనే వీళ్ళ ఇళ్ళు. వాళ్ళు పని నుంచి వచ్చేదాకా అటూ ఇటూ తిరక్కుండా ఇక్కడ కూర్చోమంటాను."

"అయితే ఇప్పటికీ మీరు ఇదివరకులానే వీళ్ళకి కథలూ అవీ చెప్తున్నారా" నవ్వుతూ అడిగాడు సూర్యనారాయణ.

"ఇప్పుడు నేను చెప్పే ఆ కథలు ఎవరు వింటారు, టీవీ పెడితే చాలు వీళ్ళకి. అప్పుడు మీతోనే అయిపోయింది ఆ కథలూ నాటకాలూ. అయ్యో, ఇలానే కూర్చో పెట్టేశాను. ఉండండి వంట చేసేస్తాను, ఏ వేళప్పుడు బయలుదేరావో, తింటూ మాట్లాడొచ్చు" హడావుడిగా లేవబోతున్న కస్తూరిని ఆపాడు సూర్యనారాయణ.

"మీ చేతి ప్రసాదం మహా భాగ్యం అమ్మా, తప్పకుండా తింటాను, కానీ ఇప్పుడు నేను వచ్చిన పని వినండి. వచ్చేవారం మా ఇన్‌స్టిట్యూట్ యాన్యువల్‌డే. మీరు తప్పకుండా రావాలి. నాతో మిమ్మల్ని తీసుకెళ్ళడానికి వచ్చాను. మీరు సరే అంటే ఇప్పుడే బయలుదేరిపోదాం హైదరాబాద్‌కి."

"వచ్చే వారం కదా, తప్పకుండా వస్తాను. ఇప్పటికిప్పుడు అంటే రాలేను, నెమ్మదిగా నాలుగు రోజులు ఆగి వస్తాను. నాకూ నీ వైభవం చూడాలనే ఉంది. మా చిన్న సూరి ఇంత పెద్దవాడయ్యాడంటే ఎందుకు రాను. ముందు



లేచి మీ ఇద్దరూ కాళ్ళూ చేతులూ కడుక్కు రండి" కస్తూరి వంట ఇంట్లోకి కదిలింది.

★ ★ ★

కరతాళ ధ్వనులతో సభ మారుమోగిపోతోంది. స్టేజీ మీద కూర్చున్న కస్తూరికి కలలో ఉన్నట్టు, ఏమి అర్థం కానట్టు ఉంది. యాన్యువల్‌డే చూడ్డానికి అనుకుని వచ్చిన కస్తూరికి- తానే ముఖ్య అతిథి అని పల్లకిలో తీసుకు రావడం, స్టేజీ మీద కలెక్టర్ పక్కన కూర్చోపెట్టి పాద పూజ చెయ్యడం... ఇవన్నీ చాలా ఇబ్బందిగా, సంకోచంగా ఉన్నాయి. ఏమి మాట్లాడాలో తెలీకుండానే అన్నీ జరిగిపోతున్నాయి. ఇంతలో 'మన గౌరవ ముఖ్య అతిథి కస్తూరిగారు ఇప్పుడు సభని ఉద్దేశించి ప్రసంగిస్తారు' అని అనౌన్స్‌మెంట్ విని, నెమ్మదిగా లేచి మైక్ అందుకుంది కస్తూరి.

"అందరికీ నమస్కారం, నాకు నిజంగా ఏమీ అర్థం కావట్లేదు. మా సూరి... క్షమించాలి సూర్యనారాయణ యాన్యువల్‌డే చూడ్డానికి రమ్మంటే వచ్చాను కానీ... నాకెందుకు ఈ సత్కారం, ఈ సన్మానం... నాకు ఏమీ అర్థం కావట్లేదు. నేను చేసింది ఏమీ లేదు. తన చేత ఓనమాలు దిద్దించింది లేదు, చదువు చెప్పింది లేదు. నాకు తెలిసిన కథలు ఏవో నాలుగు చెప్పాను అంతే. ఈ మాత్రానికే నన్ను ఇంత అందలం ఎక్కించడం తన పెద్ద మనసుకి నిదర్శనం తప్ప, నా గొప్పేం లేదు. ఇదంతా చూస్తుంటే నాకు ఒక చిన్న కథ గుర్తొస్తోంది. శ్రీరాముడు లంకకి వెళ్ళడానికి అందరూ సముద్రం మీద వారధి కడుతున్నారట. పెద్ద పెద్ద బండరాళ్ళు తీసుకుని వచ్చి వానరులు అంతా వారధి కడుతుంటే, అక్కడ ఉన్న ఒక చిన్న ఉడత తానూ సాయం చేద్దామనుకుని అక్కడ ఉన్న ఇసుకలో దొర్లి రాళ్ళ మధ్య ఆ ఇసుకని దులిపిందట. దాన్నే 'ఉడత సాయం' అంటారు. నేను ఏమన్నా చేశానూ అంటే, ఆ ఉడత సాయమే, సూరి తానే కష్టపడ్డాడు, ఇంత పైకి వచ్చాడు. అతని జీవితం స్ఫూర్తిదాయకం. మీ పిల్లలందరూ తన జీవితం నుంచి నేర్చుకోవలసింది చాలా ఉంది. నాకు ఇంతకన్నా మాటలు రావట్లేదు."

కస్తూరి పక్కకి వచ్చి మైక్ తీసుకున్నాడు సూర్యనారాయణ.

"అమ్మగారు ఇప్పుడు ఉడతసాయం అంటే ఏమిటో మీకు చెప్పారు కదా, నాకు తెలిసిన ఉడత సాయం గురించి నేను చెప్తాను వినండి. ఉడత- తన దగ్గరున్న గింజలు తరవాత తిందామని భూమిలో బొరియలు తవ్వి దాస్తుంది కానీ తరవాత మర్చిపోతుంది. అవే మొలకెత్తి, పెరిగి పెద్దయి వృక్షాలవుతాయి. ఆ ప్రకారం- మన భూమి మీద ఉన్న లక్షలకొద్దీ చెట్లూ అడవులూ ఉడతలు నాటినవే. అలానే అమ్మగారు మాలో- చదువు మీద ఆసక్తి అనే విత్తనం నాటారు. అది నాలోనూ నా స్నేహితులలోనూ పెరిగి పెద్దది అయి ఇప్పుడు ఈ వనంగా మారింది. మా గూడెంలో అందరూ ఇప్పుడు విద్యావంతులే, చాలామంది ఈ ఇన్‌స్టిట్యూట్‌లో పార్ట్‌నర్స్ కూడా. ఆ వయసులో మాకు చదువు మీద ఆసక్తి కలిగించకపోతే నేను ఇప్పటికీ గేదెలు కాచుకుంటూ, మిగిలినవాళ్ళు ఏ పాలేరు పనులో చేస్తూ ఉండిపోయేవాళ్ళం. నేను సభాముఖంగా అమ్మగారికి చేసుకుంటున్న విజ్ఞప్తి ఏమిటంటే- మీరు మా స్కూల్‌లో చిన్నపిల్లలకి, మాకు చెప్పినట్టే కథలూ అవీ చెప్పండి. ఈ జనరేషన్ వాళ్ళకి ఆ నీతి కథలూ పంచతంత్రాలూ తెలియాల్సిన అవసరం ఉంది. ఒప్పుకుంటారా అమ్మగారూ..." ఆశగా అడుగుతున్న సూర్యనారాయణని చూస్తే చిన్నప్పటి సూరినే గుర్తొచ్చి చిరునవ్వు నవ్వింది కస్తూరి.

"అవన్నీ నువ్వు ఈజీగా చేసుకోగలవు సూరీ... నేనే చెప్పక్కర్లేదు మీ స్కూల్స్‌లో పిల్లలకి. నేను ఇక్కడ ఉండాలని నువ్వు ఇలా అడుగుతున్నావు- అంతే. కానీ నువ్వు అంటున్నట్టు నేను చెప్పిన నాలుగు ముక్కలు నిజంగా నీకంత ఉపయోగపడ్డాయంటే- ఇప్పటికీ అలా చెప్పాల్సిన పిల్లలు మా ఇంటిచుట్టూ ఉన్నారు. వాళ్ళేదో కాలక్షేపం చేస్తున్నారులే టీవీ చూస్తూ అని నేను పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు వాళ్ళకి మళ్ళీ ఇలా- ఇంత నిబద్ధతతో చెప్పడానికి ప్రయత్నిస్తాను. వాళ్ళల్లో ఒక్క సూర్యనారాయణ ఉన్నా ఇంకో పెద్ద వనం తయారవుతుంది. నన్ను ఇంకోసారి ప్రయత్నించనీ."

కరతాళధ్వనులతో మోగిపోతున్న సభతో తనూ చెయ్యి కలిపాడు సూర్యనారాయణ మూర్తి. ★

విత్తనం వేయక్కర్లేదు, సాగుచేయాల్సిన పనేలేదు... ఆదాయం మాత్రం అద్భుతం. అది కూడా చిన్నమొత్తమేమీ కాదు... లీటర్ నూనె ధర సుమారుగా రూ.9 లక్షలు. ఇంతగా లాభాలు పండిస్తున్న ఆ పంట ఏంటో తెలుసుకోవాలని ఉంది కదా? ఈ నూనె... మనందరికీ తెలిసిన మొగలి పూల నుంచే తయారవుతోంది. సుగంధాల్లో రారాణిగా పిలుచుకునే మొగలి పూలు ఉద్దానం ప్రజలకు ఆదాయవనరుగా ఎలా మారాయో తెలుసుకుంటారా...





మొగలి నూనె... లీటర్ తొమ్మిది లక్షలు!





సముద్ర తీర ప్రాంతాలకు రక్షణగా ఉండే చెట్లు అంటే సాధారణంగా మనకేం గుర్తుకొస్తాయి... మడ అడవులే కదా! కానీ, శ్రీకాకుళంలోని ఉద్దానం తీరప్రాంతంలో మాత్రం మొగలిడొంకలే గుర్తుకొస్తాయి. ఇవి కూడా మడ అడవుల మాదిరిగానే పైకి కనిపించే ప్రత్యేకమైన వేర్లతో ఎత్తుగా, దట్టంగా పెరుగుతూ కట్టని ప్రాకారంలా మారి, వేల ఏళ్లుగా తీరప్రాంతాన్ని తుపాన్ల నుంచి కాపాడుతున్నాయి. అల్లంత దూరాల నుంచే సువాసనలు వెదజల్లే ఈ మొగలిపూల ఆకులకు పదునైన రంపాల్లాంటి ముళ్లు ఉండటంతో ఇక్కడి రైతులు తమ కొబ్బరి, జీడిమామిడి తోటలకి వీటిని సహజ కంచెలుగా వాడుతున్నారు. ఒక్క కొమ్మవేస్తే చాలు, ఏడాదిలోపే వేగంగా పిలకలువేస్తూ దట్టమైన కంచెగా మారిపోతుంది. ఈ ముళ్ల డొంకలని దాటుకుని పశువులు పొలాల్లోకి రాలేవు. అలాగే ఈ చెట్లకు తెగుళ్లు రావు కాబట్టి మందులు కొట్టాల్సిన పని కానీ, ఎరువులు వేయాల్సిన అవసరం కానీ ఉండదు, పైగా చుక్కనీరూ అక్కర్లేదు. అంటే పూర్తిగా పెట్టుబడిలేని పూల పంట అన్నమాట. అదే సిమెంట్ కంచెల్లాంటివి వేస్తే రెండేళ్లకే పాడవుతాయి, బోలెడు ఖర్చు కూడా. ఇలా తీర ప్రాంతాలకు రక్షణగా, పొలాలకు కంచెగా ఉన్న మొగలి డొంకలే ఇప్పుడు లక్షలు అందిస్తూ అక్కడి రైతులకూ, స్థానికులకూ ఆదాయ వనరుగా కూడా మారాయి. పాత రోజుల్లో ఈ మొగలిపూలను కేవలం జడలో అలంకరణగా, సువాసనకోసం మాత్రమే వాడేవారు. కానీ ఈ పూలలోని ఎంజైమ్‌లకు జీర్ణశక్తిని పెంచే గుణంతోపాటు, ఒత్తిడిని తగ్గించే శక్తి కూడా ఉందని తేలడంతో వీటి నుంచి తీసిన నూనెలని ఆహారపదార్థాలూ, కాస్మెటిక్స్, ఔషధాల్లో ఎక్కువగా వినియోగిస్తున్నారు. దాంతో ఉద్దానం ప్రాంత ప్రజలకు ఈ పూల సేకరణ సరికొత్త ఆదాయ వనరుగా మారింది.



తెల్లవారుజామునే సేకరించి....

శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం సముద్రతీరంలో ఆరువేల హెక్టార్లలో ఈ మొగలితోటలు విస్తరించి ఉన్నాయి. ఏడాది పొడవునా ఈ మొగలిపూలు పూసినా, వర్షాకాలంలో ముఖ్యంగా జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ ఇవి ఎక్కువగా పూస్తాయి. దాంతో కవిటి, సోంపేట, మందస, కంచిలి, సంతబొమ్మాళి, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు ప్రాంతాల రైతులూ, స్థానికులూ ఈ సమయంలో పూలసేకరణపైన ఎక్కువగా ఆధారపడతారు. పూలు తాజాగా సువాసనలు వెదజల్లే సమయం కాబట్టి తెల్లవారుజాము నుంచి మొదలుపెట్టి పదివరకూ వీటిని సేకరిస్తారు. ఒక్కొక్కరూ రోజూ పది నుంచి ముప్ఫై పూలని సేకరిస్తారు. ఒక్కో పువ్వు రూ.30 నుంచి వంద రూపాయల వరకూ పలుకుతుంది. అంటే ఒక్కొక్కరూ రోజుకి సుమారుగా పదిహేనువందల వరకూ



సంపాదిస్తారు. అదే పొలంలో వేస్తే ఎకరాకు 300 చెట్లు పడతాయి. ఏడాదిలో మూడు దఫాలుగా పూతకొచ్చి, ఒక్కో చెట్టుకు పదమూడు వరకూ పూలు వస్తాయి. ఇలా సేకరించిన పూలను వ్యాపారులే ఊళ్లకొచ్చి కొనుక్కుని... బట్టీలకు తరలిస్తారు. ఇక్కడ ఇత్తడి పాత్రలని వాడి, డిస్టిలేషన్ పద్ధతిలో పూలనుంచి నూనె, నీరు, అత్తరు వంటివి తయారుచేస్తారు. లీటర్ నూనె తొమ్మిది లక్షల రూపాయలకు పైమాటే. అయితే, ఇందుకోసం సుమారుగా 15వేల పూలని బట్టీల్లో వేసి మరిగించాలి. ఇలా నూనెని తయారుచేసే బట్టీలు ఇక్కడ పాతిక వరకూ ఉంటాయి. కన్నౌజ్, కాన్పూర్, భువనేశ్వర్, జైపూర్, కోల్‌కతాల్లోని వ్యాపారులు ఈ నూనెని కొనుగోలు చేసి... పర్ఫ్యూమ్‌ల తయారీకోసం రష్యా, చైనా దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ఈ నూనె నుంచి చేసిన కేవరా వాటర్- బిర్యానీకి రుచితో పాటు ప్రత్యేకమైన పరిమళాన్నిస్తుందట. పువ్వు ఒక్కటే కానీ... ప్రయోజనాలు బోలెడన్నమాట!

సహకారం: బత్తుల కామేశ్వర్రావు, సోంపేట, ఈనాడు



చిన్న పట్టణాల్లో 'సూపర్' విప్లవం..!





మామూలు కిరాణా దుకాణానికీ ఓ సూపర్ మార్కెట్‌కీ మధ్య చాలా తేడాలే ఉన్నా ప్రధానంగా ఓ విషయాన్ని చెప్పుకోవచ్చు. అది... సూపర్ మార్కెట్‌కి స్త్రీలు ఎక్కువగా వస్తారు. అక్కడ ఎంత సేపన్నా ఉండి... ఎంపిక చేసుకుంటారు. ఒకప్పుడు ఆ అవకాశం లేదు కాబట్టే నెలవారీ వెచ్చాల్ని తెచ్చే బాధ్యత మగవారిదే అయ్యేది. ఆ రకంగా నేటి మహిళలు మెచ్చే సూపర్ మార్కెట్ అనుభవాన్ని... చిన్న పట్టణాలకీ తెచ్చారీ తెలుగు కుర్రాళ్లు! 'సూపర్ కె' పేరుతో... ఓ సాహసోపేత ఆలోచనని వందకోట్ల వ్యాపారంగా మలచుకున్నారు!

'సూపర్ మార్కెట్లా... అబ్బో అక్కడున్న జిగేల్ లైట్లూ, ఏసీలకయ్యే ఖర్చూ మనమీదే రుద్దుతారు. వాళ్లు ప్యాకెట్లలో పెట్టి అమ్మేవి ఎన్నాళ్ల కిందటివో అయ్యుంటాయి' - అనేవాళ్లట కొందరు. 'అబ్బే... అక్కడికెళితే మనలాంటి పల్లెవాళ్లని చిన్నచూపు చూస్తారు! టిప్పుటాపు డ్రెస్ వేసుకుంటేనే లోపలికి రానిస్తారు' - ఇలా జంకేవాళ్లట ఇంకొందరు. సూపర్ మార్కెట్ల పట్ల పల్లెప్రజలకున్న ఇలాంటి అపోహలన్నింటినీ తుడిచిపెట్టి చిన్న పట్టణాలవాళ్లనీ వాటి వినియోగదారులుగా మార్చారు... నీరజ్, అనిల్! పాకాల, చౌడేపల్లి, సుండిపెంట, గోరంట్ల, మనుబోలు, కోయిల కుంట్ల, చిన్నగొట్టిగల్లు... లాంటి గ్రామాలకూ, చిన్న పట్టణాలకూ తమ 'సూపర్ కె' స్టోర్‌లని తీసుకెళ్లగలిగారు. వీటిల్లో కనీసం బ్యాంకు, పెట్రోలు బంకు కూడా లేని ఊళ్లూ ఉన్నాయి. తమ సంస్థ ఫ్రాంఛైజీల ద్వారా... ఒకప్పుడు వెల్డర్లుగా, టీచర్లుగా, చిల్లరకొట్టు వ్యాపారులుగా ఉన్నవాళ్లని నెలకి ఎనిమిది నుంచి 12 లక్షల దాకా టర్నోవర్ చూసే వ్యాపారులుగా మారుస్తున్నారు. నీరజ్, అనిల్ స్థాపించిన 'సూపర్ కె' సంస్థకి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 130 స్టోర్లు ఉన్నాయి. వాటి ద్వారా ఏటా వంద కోట్ల టర్నోవర్ వస్తోంది. ఇంతా చేస్తే ఐదేళ్లకిందట కేవలం రూ.15 లక్షలతో మొదలుపెట్టిన సంస్థ ఇది!

కాలేజీ ఫ్రెండ్స్...

నీరజ్ మెంట సొంతూరు కడప. అనిల్ తొంటెపుదేమో రాజమహేంద్రవరం. కాకపోతే, ఇద్దరి తల్లిదండ్రులూ కేంద్రప్రభుత్వ ఉద్యోగులు కాబట్టి దేశంలోని వివిధ నగరాల్లో చదువుకున్నారు. బిట్స్ పిలానీలో విద్యార్థులుగా కలిశారు. ఇద్దరూ కలిసి బిట్స్‌లో పలు ప్రాజెక్టులు చేసే క్రమంలో మంచి మిత్రులయ్యారు. ఓసారి మిత్రులిద్దరూ బిట్స్‌పిలానీ తరపున రాజస్థాన్‌లో పనిచేస్తున్న 'ప్రథమ్' అనే ఎన్జీఓని పరిశీలించడానికని అక్కడి మారుమూల పల్లెలకి వెళ్లాల్సి వచ్చిందట. నగరాల్లో పుట్టిపెరిగిన ఆ ఇద్దరికీ... అదే తొలి గ్రామీణ అనుభవమట. అప్పుడే పల్లెవాసుల ఇబ్బందుల్ని టెక్నాలజీ ద్వారా తీర్చేలా ఏదైనా స్టార్టప్ పెట్టాలన్న ఆలోచన వచ్చిందట. కాకపోతే ఆ కల నెరవేరడానికి మరో పదేళ్లు ఆగాల్సి వచ్చింది..!



ఆలోపు...

బిట్స్‌పిలానీలో కోర్సు పూర్తికాగానే నీరజ్ ఫ్లిప్‌కార్ట్‌లో పనిచేశాడు. అక్కడి పని సంస్కృతి- ఓ మామూలు ఆలోచనని స్టార్టప్‌గా మార్చడం ఎలాగో తనకి బాగా ఒంటపట్టించిందని చెబుతాడు. అక్కడ కొన్నేళ్లు పనిచేశాక పల్లెప్రాంతాల వాళ్ల కోసం ఏదైనా సంస్థని ఏర్పాటుచేయాలన్న తన పాత కలకి మళ్లీ ఊపిరిపోశాడు. అలా సూపర్‌మార్కెట్‌లని గ్రామీణ ప్రాంతాలకీ తీసుకెళ్లాలన్న ఆలోచన వచ్చింది నీరజ్‌కి. ఈ విషయాన్ని అనిల్‌తో పంచుకుంటే... వెంటనే అతనితో కలిసి వస్తానన్నాడు. అనిల్ బిట్స్ పిలానీలో చదువయ్యాక ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తూ దానికి రాజీనామా చేసి ఇలా మిత్రుడితో చేతులు కలిపాడు. కానీ ఈ కొత్త ప్రయత్నానికి వాళ్ల కుటుంబాలూ 'నో' చెప్పాయట. 'పల్లె ప్రజల ఇష్టాయిష్టాలేమిటో మీకు తెలియదు... ముప్పైనలభైయేళ్లుగా వ్యాపారం చేస్తున్నవాళ్లకే ఇబ్బందులు తప్పట్లేదు' అన్నారట అందరూ. అయినా సరే ముందుకే వెళ్లారు వీళ్లు. అప్పటిదాకా పొదుపు చేసిన రూ.15 లక్షల పెట్టుబడితో 'సూపర్ కె' స్టార్టప్‌ని పెట్టారు. కడప శివారులో అతికష్టంపైన నలుగురు కిరాణాషాపులవాళ్లని ఫ్రాంఛైజీకి ఒప్పించి... వాళ్లకి నమూనాగా సొంతంగా రెండు స్టోర్‌లని ఏర్పాటుచేశారు. కానీ వాటిని ప్రారంభించిన నెలకే... కరోనా లాక్‌డౌన్ పడి... మిత్రులిద్దర్నీ బెంబేలెత్తించింది!

కానీ...

లాక్‌డౌన్ సమస్యనే అవకాశంగా మలచుకున్నారు మిత్రులు. కరోనా వంకతో కిరాణాషాపులన్నీ ఎమ్మార్పీకి రెండురెట్ల ధరతో సరుకులమ్మితే... వీళ్లు అసలు రేటుకన్నా తక్కువకి ఇవ్వసాగారు. దాంతోపాటూ 'నాణ్యత విషయంలోనూ ఎక్కడా రాజీలేకుండా చూసుకున్నాం. దాంతో ఐదు షాపులు కాస్తా ఏడాది తిరిగేసరికి పదిహేనయ్యాయి...' అంటాడు నీరజ్. రెండో ఏడాదే- వంటసరుకుల నాణ్యత ఏమాత్రం తగ్గకుండా ఉండేందుకని అత్యాధునిక వేర్‌హౌస్‌లూ ప్రాసెసింగ్ యూనిట్‌లని ఏర్పాటుచేసుకున్నారు. 'స్టోర్‌లకి సంబంధించిన స్థలాలని మేమే సెలెక్ట్ చేయడం, సరకు సరఫరాకీ బిల్లింగ్‌కీ ఆధునిక సాఫ్ట్‌వేర్‌లని అందించడంతో... ఫ్రాంఛైజీల పని సులువైంది. మూడేళ్లలో మేం 130 స్టోర్లు స్థాపించడానికి అదే కారణం' అని చెబుతాడు అనిల్. ఆ రకంగా ఏడాదికి 41 శాతం వృద్ధితో దూసుకెళుతోంది 'సూపర్ కె' సంస్థ. అది చూసి ఫ్లిప్‌కార్ట్ వ్యవస్థాపకుడు బిన్నీ బన్సాల్‌తోపాటు, బ్లూమ్‌వెంచర్స్ వంటి సంస్థలూ రూ.150 కోట్లదాకా పెట్టుబడుల్ని అందించడం విశేషం! ★

అటు ఆధ్యాత్మిక ఆనందాన్నీ, ఇటు మానసిక సాంత్వననూ కలిగించడంలో ముందుంటాయి అగరుబత్తీలు. అందుకే వాటి గుబాళింపు ఇప్పుడు పూజా మందిరానికి మాత్రమే పరిమితం కాకుండా.... నట్టింటి నుంచి పడకగదివరకూ వ్యాపిస్తోంది. అదీ కొత్తకొత్త రూపాలూ రంగులూ అదనపు ప్రయోజనాలను అద్దుకుని మరీ...



అగరుబత్తీ... మారిందండీ!

పూజ చేస్తున్నప్పుడు దీపారాధనతో పాటు రెండుమూడు అగరుబత్తీలను వెలిగించామా... ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా పరిమళభరితమవుతుంది. ఆలయంలో ఉన్న భావన కలుగుతుంది. మనసుకూ ఎంతో హాయిగా అనిపిస్తుంది. సానుకూల దృక్పథం కూడా పెరుగుతుంది. అందుకే ఒకప్పటిలా వాటిని కేవలం పూజ గదిలో మాత్రమే కాకుండా... హాల్లో, పడకగదిలో, ధ్యానం చేస్తున్నప్పుడూ, యోగాసనాలు వేస్తున్నప్పుడూ వెలిగించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆ అవసరాలకు సరిపోయేలా అవీ రకరకాల సువాసనల్లో రావడమూ చూస్తూనే ఉన్నాం. వీటితో వచ్చే ఇబ్బందేంటంటే... వెలిగించాక పూర్తయ్యేవరకూ అలాగే వదిలేయాల్సిందే తప్ప మధ్యలో ఆర్పలేం. పైగా ఆ పొగా ఇంట్లో ఉన్న అందరికీ పడకపోవచ్చు. ఇంకా... అగరుబత్తీలనగానే నలుపూ ముదురు గోధుమ వంటి రంగుల్లో పొడవాటి పుల్లల్లా వస్తాయి తప్ప కొత్తదనం ఉండదు. వాటికోసం మంచి స్టాండు ఉన్నప్పుడే ఆ నుసి కిందపడకుండా ఉంటుంది. తయారీదారులు ఇవన్నీ అర్థం చేసుకున్నట్లున్నారు. అందుకే ఇప్పుడు వీటినీ నచ్చినట్లుగా వాడుకునేలా... రకరకాల డిజైన్లలో కొత్తకొత్తగా తీసుకొచ్చేస్తున్నారు.

కోరుకున్నంతసేపు వెలిగేలా...

ధ్యానం లేదా యోగా చేస్తున్నప్పుడు... ఓ అగరుబత్తీని వెలిగిస్తే ఏకాగ్రత కుదరడంతో పాటు మన చుట్టూ ఉన్న వాతావరణమంతా ఆహ్లాదభరితంగా మారుతుందనేది తెలిసిందే. ఆ సమయంలో సాదాగా ఉండే పొడవాటి అగరుబత్తీలను కాకుండా ఆకులూ, కొమ్మలూ, పూలూ... వంటి రూపాల్లో ఉన్నవాటిని ఎంచుకోవచ్చు. ఇవన్నీ చిన్నగా ఉంటాయి కాబట్టి మన అవసరానికి అనుగుణంగా ఒకటి నుంచి రెండువరకూ మాత్రమే వెలిగించుకోవచ్చు. అగరుబత్తీల పరిమళం బాగున్నా వాటినుంచి వచ్చే పొగతో ఉక్కిరిబిక్కిరి అయిపోతుంటారు కొందరు. అలాంటి వారికోసం తక్కువ పొగతో వచ్చే లో స్మోక్ రకాలనూ తీసుకొస్తున్నారు. కొన్ని అగరుబత్తీలు ఇలా వెలిగించిన కాసేపటికే అలా అయిపోతుంటాయి. అలాగని మళ్లీమళ్లీ వాటిని వెలిగిస్తూ కూర్చోలేంగా. అలాంటప్పుడు - రోజ్‌మేరీ, లావెండర్ పూల రేకులూ, అరోమానూనెలు తదితరాలన్నీ కలిపి తయారుచేసి అన్నింటినీ పేర్చినట్లుగా కనిపించే అగరుబత్తీలను ఎంచుకున్నామా... దాదాపు యాభై నిమిషాల నుంచి గంటసేపటి వరకూ వెలుగుతాయి. ఇవి రంగురంగుల కాయిల్స్ రూపంలోనూ వస్తున్నాయి. అలా కాకుండా మనం కోరుకున్నంతసేపు మాత్రమే వెలగాలనుకునేవారికోసమూ ఇప్పుడు ప్రత్యేకంగా ఇన్‌సెన్స్ చిప్స్, క్యూబ్స్, స్టిక్స్, బాల్స్ రకాలెన్నో ఉన్నాయి. వీటిల్లో క్యూబ్స్, చిప్స్, బాల్స్‌ను కావాల్సినంత మేర ముక్కల్లా కట్ చేసుకుని ఉపయోగించుకోవచ్చు. అంతేనా... సాంబ్రాణి, కర్పూరం తదితర సువాసనల్ని వెదజల్లే రకాలూ దొరుకుతున్నాయిప్పుడు. అదేవిధంగా అగరుబత్తీల నుసి కిందపడకుండా వంపులు తిరుగుతూ ఓ డిజైనులా మారిపోయేవి వెలిగించామా... అగరుబత్తీస్టాండు ఓ ఆర్ట్‌పీస్‌లా మారిపోతుంది తెలుసా! ఇంకా... పూజలూ, పండుగల సమయంలో వెలిగించేందుకు సాదాగా కాకుండా మల్టీకలర్ తోపాటు... బంగారురంగులో ఉండేవాటినీ ట్రై చేయవచ్చు. బంగారంతో పోతపోసి గానీ తయారుచేశారా అన్నట్లుగా కనిపిస్తాయివి. ఆకులూ, పూలూ గుత్తులు గుత్తులుగా కట్టినవీ, చందనపు చెక్కల్లా కనిపించేవీ... ఇలా ఎన్నెన్నో వెరైటీలు వచ్చేస్తున్నాయి. కాబట్టి... ఈసారి అగరుబత్తీలను ఎంచుకుంటున్నప్పుడు కేవలం వాటి సువాసనకు మాత్రమే పరిమితం కాకుండా.. ఇలాంటి రకాలనూ చూడండి. ఇంటికొచ్చినవారికి వీటినీ కస్టమైజేషన్ చేయించుకున్నామని గొప్పగా చెప్పుకోవచ్చు. ★





గప్‌చుప్

పిల్లలు హాయిగా ఆడుకుంటున్నారు కదూ! బొమ్మను జాగ్రత్తగా గమనించి కింది ప్రశ్నలకు జవాబులు చెప్పండి చూద్దాం.

1. బొమ్మలో సీతాకోకచిలుకలూ, బెలూన్లూ కనిపిస్తున్నాయి కదా. ఎన్నెన్ని ఉన్నాయి?
2. ఇక్కడ కొన్ని ఆంగ్ల అక్షరాలు దాగున్నాయి. మీకు కనిపించాయా?
3. పిల్లల్లో ఒకరికి ప్రమాదం పొంచి ఉంది. ఎవరికి?
4. ఇందులో ఒక పొరపాటు ఉంది. అది ఏంటబ్బా?
5. బొమ్మలో పలక ఎక్కడుందో మీకు కనిపించిందా?




దాగుడుమూతలు

ఇంట్లో అమ్మ డ్రెస్ కుడుతుంటే... అక్కడే కూర్చొని చూస్తుందో పాప. అయితే, ఇక్కడ కింది వరసలో ఉన్న వస్తువులు లేదా బొమ్మలు... పైనున్న చిత్రంలో దాగున్నాయి. ఎక్కడున్నాయో కనిపెట్టండి చూద్దాం.




దారి కనుక్కోండి

సైన్స్ టీచర్ విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తూ... ఇక్కడున్న సీసాల్లో ఒక చివర ద్రావణం పోస్తే, మరో చివర పొగలు వస్తాయని చెప్పారు. మరి ఆ నీళ్లు పొగలా మారే మార్గం ఏదో చెప్పండి చూద్దాం.



జత ఏది?

క్లాస్ రూమ్‌లో పిల్లలు ఆడుకుంటూ నంబర్ బ్లాక్స్ డబ్బాని కింద పడేయడంతో అవి ముక్కలు అయ్యాయి. మరి వాటిలో సరైన జతలు ఏవో చెప్పగలరా?




అసలైన బహుమతి!

ఉదయగిరి రాజ్యానికి రాజు విజయేంద్రవర్మ. ఒకరోజు ఆయన మంత్రిని పిలిచి 'యుద్ధ విద్యల్లో పోటీ నిర్వహించనున్నామనీ, వాటిల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి వెయ్యి వరహాలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి మూడు వేల వరహాలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి అయిదు వేల వరహాలు బహుమతిగా అందిస్తామనీ రాజ్యమంతా దండోరా వేయించండి' అని చెప్పారు. రాజాజ్ఞ ప్రకారం అదే రోజు రాజ్యంలో దండోరా వేయించాడు మంత్రి. అది విని... 'ప్రథమ కంటే ద్వితీయ, తృతీయ బహుమతులకే ఎక్కువ వరహాలు అంటూ పొరపాటుగా ప్రకటించారేమో'నని అనుకున్నారందరూ. పోటీల తేదీ రానే వచ్చింది. తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు చాలామంది యువకులు వచ్చారు. ప్రజల సమక్షంలో పోటీలన్నీ హోరాహోరీగా జరిగాయి. వాటిల్లో యుగంధర్, జయదేవ్, రణ్‌వీర్ అనే ముగ్గురు మాత్రమే తుది దశకు ఎంపికయ్యారు. మహారాజు ఆ ముగ్గురినీ పిలిచి, బహుమతి వివరాలను మరోసారి స్వయంగా వివరించారు. అంతే కాదు... 'మీ ముగ్గురూ మన ఆస్థాన మల్లయోధుడిని ఓడిస్తే ప్రథమ స్థానంలో నిలుస్తారనీ, ఓడిపోతే ముగ్గురూ తృతీయ స్థానంలోనే నిలిచి- ఆ మేరకు ప్రకటించిన ఆ బహుమతి అందుకుంటారు' అని చెప్పారు. మొదటగా

అది ఏది?

ఇక్కడ రంగు గడిలో ఉన్న బొమ్మను పోలి ఉన్నదేదో చెప్పండి చూద్దాం.






ఏవి ఎన్ని?



ఇక్కడున్న ఆకారాల్లో ఇచ్చిన గుర్తులు ఏవి ఎన్ని ఉన్నాయో లెక్కించి పైనున్న గడుల్లో రాయండి.




పోలికలేంటి?

ఈ బొమ్మల్లో అడ్డం, నిలువు, ఐమూలగా ఉన్న వాటికి కొన్ని పోలికలున్నాయి. అవేంటో చెప్పగలరా?



ఆస్థాన మల్లయోధుడితో యుగంధర్ పోటీలోకి దిగాడు. తృతీయ బహుమతికే ఎక్కువ మొత్తం కావడంతో ఓడిపోవడమే మంచిదనుకున్నాడు. అందుకు తగినట్లే... ప్రత్యర్థికి ఏమాత్రం పోటీ ఇవ్వకుండానే ఓడిపోయాడు. ఆ తర్వాత జయదేవ్ కూడా అదే ఆలోచనతో బరిలోకి దిగాడు. ఏదో తూతూమంత్రంగా పోరాడినట్లు చేసి



ఓటమిపాలయ్యాడు. రణ్‌వీర్ మాత్రం పట్టు విడవకుండా ఆస్థాన మల్లయోధుడితో తలపడి విజయం సాధించాడు. ఓడిపోయి తృతీయ విజేతలుగా నిలిచిన యుగంధర్, జయదేవ్‌లను మహారాజు పిలిచి... ‘మీకు గెలిచే సత్తా ఉన్నా, ఎక్కువ వరహాలు వస్తాయనే ఆశతో, కనీసం పోరాటం కూడా చేయకుండా ఓడిపోయారని నాకు అర్థమైంది. కానీ ఈ పోటీ ప్రధాన ఉద్దేశం మన రాజ్యంలో ఖాళీగా ఉన్న సైన్యాధికారి పదవిని అర్హత ఉన్న వారితో భర్తీ చేయటమే. బహుమతి కోసం తనను తాను మోసం చేసుకోకుండా... పోరాట స్ఫూర్తి చూపిన రణ్‌వీర్‌ను సర్వసైన్యాధ్యక్షుడిగా నియమిస్తున్నా’నని ప్రకటించారు. రాజు వేయించిన దండోరాలోని మర్మాన్ని అర్థం చేసుకోకుండా కేవలం బహుమతి సొమ్ము కోసం కక్కుర్తి పడి... మంచి అవకాశాన్ని చేజేతులా కోల్పోయామని జయదేవ్, యుగంధర్‌లు బాధపడ్డారు.

– మొర్రి గోపి

జవాబులు

గప్‌చుప్: 1. నాలుగు, అయిదు 2. బంతి పైన A, ఇంటి పైకప్పు మీద E, పొదలో M, చెట్టు ఆకుల్లో S 3. నిచ్చెన మీదున్న బాబుకు, పైకప్పు మీద పాము ఉంది 4. పక్షికి నాలుగు కాళ్లు ఉన్నాయి 5. డైనోసర్ బొమ్మ ఉన్న ఫ్రేమ్‌గా...

దాగుడుమూతలు: స్టూల్ అంచులో వంకాయ, మహిళ జుట్టులో గ్లవ్, బుట్ట హ్యాండిల్‌గా హెడ్‌సెట్, కుట్టు మిషన్ మీద బిస్కెట్, డ్రెస్ తగిలించిన స్టాండుకు పిల్లనగ్రోవి, ఫొటోఫ్రేమ్‌లో నదిలా బూమరాంగ్, కత్తెర గ్రిప్‌గా ఎనిమిది అంకె, కిటికీ కర్టెన్ రాడ్డుకు కొవ్వొత్తి.

జత ఏది?: 1-8(382), 2-5(665), 3-10(225), 4-7(283), 6-9(538).

అది ఏది?: 5 **ఏవి ఎన్ని?:** ○ = 9, △ = 5, □ = 3.

పోలికలేంటి?: అడ్డం: మిక్కీమౌస్ బొమ్మ, కర్బూజా, టేబుల్ ల్యాంప్; నిలువు: కళ్లద్దాలు, పుట్టగొడుగులు, టేబుల్ టెన్నిస్ బ్యాట్; ఐమూలగా: డైస్, మొక్కజొన్న కంకి.

చేసేద్దాం... ప్రసాదం!

అమ్మవారి పూజలు సరే, మరి ప్రసాదాల సంగతి? రోజుకో రకం నివేదిస్తే ఆ దేవి ప్రసన్నం కాకుండా ఉంటుందా చెప్పండి. ఆలస్యమెందుకు... వీటిని చేసేయండి మరి.

కొబ్బరిపాల పొంగలి

కావలసినవి: నెయ్యి: పావుకప్పు, పెసరపప్పు: అరకప్పు, బియ్యం: కప్పు, బెల్లం తరుగు: రెండు కప్పులు, కొబ్బరి ముక్కలు: పావుకప్పు, జీడిపప్పు పలుకులు: పావుకప్పు, కిస్‌మిస్: పావుకప్పు, కొబ్బరిపాలు: కప్పు, యాలకులపొడి: అరచెంచా, పచ్చకర్పూరం: చిటికెడు.

తయారీ విధానం: స్టవ్‌మీద కుక్కర్‌ను పెట్టి టేబుల్‌స్పూను నెయ్యి వేసి... పెసరపప్పునూ, బియ్యాన్నీ దోరగా వేయించుకోవాలి. ఇందులో నాలుగుకప్పుల నీళ్లు పోసి మూత పెట్టి మూడు కూతలు రానిచ్చి, దింపేయాలి. అలాగే బెల్లం తరుగును ఓ గిన్నెలో తీసుకుని అరకప్పు నీళ్లు పోసి స్టవ్‌మీద పెట్టాలి. బెల్లం కరిగి పాకంలా మారుతున్నప్పుడు దింపేసి వడకట్టుకోవాలి. ఇప్పుడు కుక్కర్‌మూత తీసి అందులో బెల్లంపాకం వేసి మళ్లీ స్టవ్‌మీద పెట్టాలి. ఇది ఉడికి కాస్త చిక్కగా అవుతున్నప్పుడు కొబ్బరిపాలు, యాలకులపొడి వేసి స్టవ్‌ని సిమ్‌లో పెట్టాలి. కడాయిలో మిగిలిన నెయ్యి వేడి చేసుకుని కొబ్బరిముక్కలు, జీడిపప్పు పలుకులు, కిస్‌మిస్‌ను వేయించి పొంగలిలో వేసి బాగా కలిపి దింపేముందు పచ్చకర్పూరం చల్లుకోవాలి.



ఆవ పులిహోర

కావలసినవి: బియ్యం: పెద్ద కప్పు, చింతపండు: నిమ్మకాయంత, సెనగపప్పు: రెండు చెంచాలు, మినపప్పు: రెండు చెంచాలు, **మెంతులు:** చిటికెడు, **ఆవాలు:** చెంచా, పచ్చిమిర్చి: ఆరు, ఎండుమిర్చి: రెండు, **ఇంగువ:** చిటికెడు, **పసుపు:** పావుచెంచా, **ఉప్పు:** తగినంత, **జీడిపప్పు పలుకులు:** పావుకప్పు, **పల్లీలు:** పావుకప్పు, **నూనె:** నాలుగు టేబుల్‌స్పూన్లు, **కరివేపాకు** రెబ్బలు: రెండు.

ఆవకోసం: **ఆవాలు:** రెండు చెంచాలు, ఎండుమిర్చి: రెండు(రెండింటినీ కాసేపు నానబెట్టుకుని ఆ తర్వాత మెత్తగా చేసుకోవాలి).

తయారీ విధానం: బియ్యాన్ని కడిగి కుక్కర్‌లో తీసుకుని రెండు కప్పుల నీళ్లు పోసి మూత పెట్టి... మూడు కూతలు రానిచ్చి దింపేయాలి. తర్వాత అన్నాన్ని ప్లేటులో పరుచుకోవాలి. చింతపండును నానబెట్టుకుని చిక్కని రసం తీసుకోవాలి. స్టవ్‌మీద కడాయిని పెట్టి నూనె వేసి... సెనగపప్పు, మినప్పప్పు, మెంతులు, ఆవాలు, ఎండుమిర్చి, జీడిపప్పు, పల్లీలను వేయించుకుని నిలువుగా చీల్చిన పచ్చిమిర్చి, కరివేపాకు వేయాలి. అవి వేగాక... చింతపండు రసం, పసుపు, తగినంత ఉప్పువేసి ఉడికించి దింపేయాలి. ఇందులో చేసిపెట్టుకున్న ఆవ పేస్టును వేయాలి. ఈ మిశ్రమాన్ని అన్నంపైన వేసుకుని కలిపితే... కమ్మని ఆవపులిహోర రెడీ.



గోధుమరవ్వ కారా పొంగలి

కావలసినవి: లావుగా ఉండే గోధుమరవ్వ: కప్పు, పెసరపప్పు: అరకప్పు, నీళ్లు: నాలుగుకప్పులు, ఉప్పు: తగినంత, నెయ్యి: మూడు టేబుల్‌స్పూన్లు, ఆవాలు: చెంచా, జీలకర్ర: చెంచా, ఎండుమిర్చి: రెండు, కచ్చాపచ్చాగా దంచిన మిరియాలు: రెండు చెంచాలు, ఇంగువ: చిటికెడు, పసుపు: అరచెంచా, కరివేపాకు రెబ్బలు: రెండు, అల్లం తురుము: టేబుల్‌స్పూను, పచ్చిమిర్చి: మూడు, జీడిపప్పు: పావుకప్పు.

తయారీ విధానం: పెసరపప్పు, గోధుమరవ్వను విడివిడిగా కడిగి పెట్టుకోవాలి. స్టవ్‌మీద కుక్కర్‌ను పెట్టి నెయ్యి వేయాలి. అది వేడెక్కాక ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, మిరియాలు, జీడిపప్పు వేయించుకుని ఇంగువ, కరివేపాకు, అల్లం తురుము వేయాలి. కరివేపాకు చిటపట లాడాక పచ్చిమిర్చి తరుగు, పసుపు వేయాలి. ఇందులో పెసరపప్పు, గోధుమరవ్వను కూడా వేసి రెండునిమిషాలు వేయించి నీళ్లు పోసి, తగినంత ఉప్పు వేసి మూత పెట్టాలి. మూడు కూతలు వచ్చాక స్టవ్‌ని కట్టేయాలి.



మిలగుపొదం

కావలసినవి: పొడిపొడిగా వండిన అన్నం: రెండు కప్పులు, నెయ్యి: టేబుల్‌స్పూను, **నూనె:** చెంచా, **ఆవాలు:** అరచెంచా, మినప్పప్పు: టేబుల్‌స్పూను, **జీడిపప్పు పలుకులు:** పావుకప్పు, **ఉప్పు:** తగినంత, **కరివేపాకు** రెబ్బలు: రెండు.

పొడికోసం: **మిరియాలు:** అరటేబుల్‌స్పూను, **జీలకర్ర:** చెంచా, **కరివేపాకు** రెబ్బలు: రెండు.


తయారీ విధానం: స్టవ్‌మీద కడాయిని పెట్టి మిరియాలు, జీలకర్ర, కరివేపాకును దోరగా వేయించి తీసుకుని వేడి కాస్త చల్లారాక పొడి చేసుకుని పెట్టుకోవాలి. స్టవ్‌మీద కడాయిని పెట్టి నూనె, నెయ్యి వేసుకుని ఆవాలు, మినప్పప్పు, జీడిపప్పు పలుకులు వేయించుకుని కరివేపాకు వేయాలి. కరివేపాకు వేగుతున్నప్పుడు తగినంత ఉప్పు, మిరియాలపొడి వేసి బాగా కలిపి స్టవ్‌ని కట్టేయాలి. ఈ కడాయిలోనే అన్నం కూడా వేసి బాగా కలిపితే సరి.



రాశి ఫలం

(సెప్టెంబరు 21 - 27)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి





మేషం అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. ఉద్యోగంలో ఉన్నతస్థితికి చేరుకుంటారు. గతంలోని ఇబ్బందులు తొలగిపోతాయి. తెలివితేటలతో పెద్దల్ని మెప్పిస్తారు. వ్యాపార ప్రయోజనాలు సాధిస్తారు. ముఖ్య విషయాల్లో స్థిరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం. మీ కాలాన్ని వృథా చేసేవారితో జాగ్రత్త. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ధ్యానించండి.



వృషభం కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఉత్తమ గ్రహస్థితి గోచరిస్తోంది. ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. వృత్తి ఉద్యోగాల్లో కొద్దిపాటి శ్రమ ఉన్నా, అంతిమ విజయం మీదే. ఆదాయ మార్గాలు విస్తరిస్తాయి. గృహ నిర్మాణం గురించి ఆలోచిస్తారు. భూలాభం సూచితం. కాలం సహకరిస్తుంది. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. ఓ శుభవార్త వింటారు. లక్ష్మీదేవిని పూజించండి.



మిథునం మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

వ్యాపార ఫలితాలు అనుకూలం. బుధుడి ప్రభావంతో శక్తిమంతమైన ఆలోచనలు వస్తాయి. మీ నిర్ణయాలు భవిష్యత్తులో భారీ లాభాలను అందిస్తాయి. ఆత్మవిశ్వాసంతో వృత్తి ఉద్యోగాల్లో మంచి స్థానానికి చేరుకుంటారు. కొందరి ప్రవర్తన ఇబ్బంది కలిగిస్తుంది. ముఖ్య లావాదేవీల్లో మిత్రుల సలహాలు తీసుకోండి. సూర్యుడిని స్మరించుకోండి.



కర్కాటకం పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

ఉద్యోగంలో మంచి జరుగుతుంది. ఆత్మవిశ్వాసం ముందుకు నడిపిస్తుంది. ముఖ్య వ్యవహారాల్లో పరాధీనత వద్దు. జీవిత లక్ష్యానికి అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసుకుంటారు. తోటివారి సహాయం అందుతుంది. సంపాదనను సద్వినియోగం చేసుకోండి. రుణ సమస్యలకు అవకాశం ఇవ్వకండి. వారం మధ్యలో మేలు జరుగుతుంది. నవగ్రహాలను స్మరించండి.



సింహం మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

అదృష్టవంతులు అవుతారు. విజయాలు గోచరిస్తున్నాయి. దీర్ఘకాలిక ప్రయత్నాలు కొలిక్కి వస్తాయి. ఆర్థిక ప్రగతిని సాధిస్తారు. గృహ నిర్మాణ లక్ష్యం సాకారం అవుతుంది. కీర్తి పెరుగుతుంది. ఉద్యోగులకు ఆటంకాలు తొలగిపోతాయి. కొందరు మీ సహనాన్ని పరీక్షిస్తారు. నలుగురితో కలుపుగోలుగా వ్యవహరించండి. మహాలక్ష్మిని ధ్యానించండి.



కన్య ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

మరింత మనోబలం అవసరం. సరైన ప్రణాళికతోనే పనులు పూర్తవుతాయి. చెడు విమర్శలను మనసులోకి తీసుకోవద్దు. అధిక గ్రహదోషం కారణంగా చిన్నచిన్న పొరపాట్లు కూడా పెద్ద సమస్యలకు దారితీస్తాయి. అప్రమత్తంగా ఉండండి. వ్యాపారంలో ఆచితూచి అడుగేయాలి. కొత్త ప్రయత్నాలకు సమయం కాదు. నవగ్రహాల్ని దర్శించుకోండి.



తుల చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ముందస్తు ప్రణాళికలు మేలు చేస్తాయి. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా ఉంటాయి. కొత్త ఆదాయ మార్గాన్ని సిద్ధం చేసుకుంటారు. వ్యాపార విస్తరణకు సమయం కాదు. ముందుజాగ్రత్తతో కొన్ని నష్టాలను అధిగమించే అవకాశం ఉంది. వారాంతంలో ఓ శుభం జరుగుతుంది. మీదైన ప్రతిభతో పెద్దలను మెప్పిస్తారు. మహాలక్ష్మి అష్టోత్తరం చదువుకోండి.



వృశ్చికం విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

ముఖ్య విషయాల్లో స్పష్టత వస్తుంది. భవిష్యత్తు శుభప్రదం. వృత్తి ఉద్యోగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు. పెద్దల ప్రశంసలు అందుతాయి. ఆర్థిక వ్యవహారాల్లో ఎరుకతో వ్యవహరించండి. దశమంలో శనిగ్రహ సంచారం వల్ల మిశ్రమ ఫలితాలు ఉంటాయి. నిర్ణయాల్లో మరింత ఏకాగ్రత అవసరం. శుక్రగ్రహ శ్లోకాన్ని పఠించండి.



ధనుస్సు మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

కృషికి తగిన ఫలితం లభిస్తుంది. కొత్త ప్రయత్నాలు విజయవంతం అవుతాయి. మనసులో చెడు ఆలోచనలకు చోటివ్వకండి. ఆర్థికంగా మెరుగైన స్థితికి చేరుకుంటారు. ఇతరుల సలహాలపైన ఆధారపడకండి. స్వబుద్ధితో నిర్ణయాలు తీసుకోండి. వ్యాపారంలో మరింత కృషి అవసరం. వారాంతంలో అదృష్టం వరిస్తుంది. కనకధారా స్తోత్రం పఠించండి.



మకరం ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

లక్ష్య సాధనలో చిత్తశుద్ధి అవసరం. మీ నిజాయతీ మిమ్మల్ని ముందుకు నడిపిస్తుంది. మాటలతో పక్కదారి పట్టించేవారితో జాగ్రత్త. అష్టమ శుక్రయోగం వల్ల ఆర్థికంగా కొంత మేలు జరిగినా, చాలా సందర్భాల్లో తీవ్రంగా శ్రమించాల్సి వస్తుంది. దైవబలం ముందుకు నడిపిస్తుంది. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు. శివకేశవుల్ని పూజించండి.



కుంభం ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

కొత్త కార్యక్రమాలను ఆరంభిస్తారు. వాయిదా మనస్తత్వం మంచిది కాదు. సరైన నిర్ణయాలతో ఉద్యోగ జీవితంలోని ఒత్తిడిని అధిగమిస్తారు. ముఖ్య వ్యవహారాల్లో కుటుంబాన్నీ భాగం చేయండి. అవసరమైతే, ఆత్మీయుల సహకారం తీసుకోండి. రుణ సమస్యలకు ఆస్కారం ఇవ్వకండి. అవగాహన లేని విషయాల్లో జోక్యం చేసుకోకండి. నవగ్రహాల్ని దర్శించుకోండి.



మీనం పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఏకాగ్రతతో విజయాలు సాధిస్తారు. చెడును అతిగా ఊహించుకోవద్దు. గ్రహదోషం అధికంగా ఉంది. మనోబలంతో ముందుకెళ్లండి. ఇతరులతో సున్నితంగా సంభాషించండి. మీ ప్రతిభ నలుగురికీ తెలుస్తుంది. మీ సహనమే మిమ్మల్ని కాపాడుతుంది. కలహ భోజనులతో జాగ్రత్త. కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. నవగ్రహాల్ని పూజించండి.

పదకేళి

కూర్పు: బాలు

1		2		✱	3		✱	4	✱	5	✱
	✱		✱	6		✱	7	✱	8		9
✱	10		11	✱	12					✱	
13		✱	14	15		✱		✱	16		✱
✱	17				✱	18	✱	19		✱	20
21		✱	22		23	✱	24		✱	25	✱
	✱	26		✱	27	28		✱	29		30
✱	31		✱	32			✱	33		✱	
34	✱	35	36		✱	37				38	✱
39		✱		✱	40		✱		✱	41	
	✱	42		43	✱	44	45	✱	46		✱
✱	47		✱	48		✱	49			✱	50

ఆధారాలు- అడ్డం

1. కొబ్బరిచెట్టు, కొబ్బరికాయ (4)
3. శిల (2)
4. అడ్డం 3తో అద్దె (1)
6. ఒక విరామచిహ్నం (2)
8. తెర (3)
10. కేరళలోని '....... పద్మనాభ స్వామి' గుడికి వెళ్ళారా? (3)
12. జందెం (5)
13. వృక్షం, చెట్టు కాండం (2)
14. ఉప్పు (3)
16. పూల'గుత్తి' (2)
17. తెలుగు నెలల్లో పదకొండవది (4)
18. అడ్డం 3తో మద్యం (1)
19. అనేక (2)
20. అడ్డం 18తో వ్యవసాయం (1)
21. అభాషణం, మాట్లాడకుండా ఉండటం (2)
22. జఘనం (3)
24. '.....'బొమ్మ అంటే శిలతో చేసిన బొమ్మ (2)
26. జాతర, కొలుపులు, తీర్థం (2)
27. ప్రేమ, గోము, గారాం (3)
29. విరివి (3)
31. పెదవి (2)
32. బిలం, భూమి లోపల మార్గం (3)
33. ఈ నామాన్ని కోటిసార్లు రాస్తే ఎంతో పుణ్యమట (2)
35. ఈశాన్య రాష్ట్రం (3)
37. తాతయ్య గుండు మీద కొద్దిపాటి జుట్టు... 'రామచిలక' లాగే ధ్వనిస్తుంది (2+3)
39. ఛాయ (2)
40. గొప్ప, దొడ్డ, మహా (2)
41. స్పర్ధ, వంతు (2)
42. రొంప (3)
44. ద్వేషం, కసి (2)
46. సత్తువ, శక్తి (2)
47. గృహం (2)
48. విహంగం (2)
49. నక్క (3)
50. అడ్డం 18తో ఏడాది (1)

ఆధారాలు- నిలువు

1. మగువ (2)
2. జెండా (3)
3. సీతారామలక్ష్మణుల కథ (4)
5. భార్య (2)
7. వణుకు (3)
8. గాలిపటాలు (4)
9. సేవ, బానిసత్వం (2)
10. సందేహం, శంక (4)
11. శిరోమణి, అన్నిటికన్నా మిన్న (5)
15. ఆమని (3)
19. భర్త (2)
21. రుషి, ముని (2)
23. సువర్ణం (3)
24. తుదిలేని రాబందు (2)
25. బియ్యం మూట (2)
26. మహానటి (3)
28. 'రాగం తానం పల్లవి' ... చివర రెండు అక్షరాలు లేవు (5)
29. 'కమల'లాంటిదే- అమ్మాయి పేరు... నిర్మలమైన అని అర్థం (3)
30. బెజ్జం (2)
32. ఒక చేప, ఒక కూరగాయ (2)
33. ఒరిపిడి, ఘర్షణం (3)
34. తాగేది (3)
36. స్వర్గం (3)
38. చెక్కిలి, బుగ్గ (3)
42. తామర (2)
43. మెరుపు (2)
45. ఏనుగు (2)
46. కొంగ (2)

సుడోకు

		2			9	6		
		5	8				9	1
	6	4						3
	7	1		2				
	2			5			8	
				4		9	3	
1						4	5	
6	5				1	7		
		8	5			3		

గతవారం సమాధానాలు



పదకేళి


1 న	టు	2 న		3 కం	చు	4 కం		5 ఆ	న	6 తి	
ర్మ		7 యు	శో	ద		8 దు	వ్వె	న		9 మి	న్న
10 ద	11 హ	సం		12 కం	13 సు	డు		14 వా	15 న	రం	
	ను		16 రు		డి		17 శా	లు	వా		18 బా
19 స	మ	20 యు		21 అం	గా	ర	కం		22 రు	23 వా	ణం
త		24 ము	25 సి		లి		26 బ	స		ను	
27 తం	28 దా	న	తా	29 న		30 నా	రి		31 ఆ	దే	శం
	వ		32 ర	మా	33 ప	తి		34 కొ	లు	వు	
35 ఓ	రి	36 మి		37 జా	ట్టు		38 అ	త్త		39 డు	40 క
	41 కం	డు	వా		42 చీ	43 వా	ట్లు		44 భ		ల
45 చి		త		46 తీ		మ		47 ఇం	ద్ర	లో	కం
	48 అ	లు	మ	గ	లు		49 త్రం		త		డ

సుడోకు

5	6	4	1	9	3	8	2	7
3	8	7	4	5	2	9	6	1
2	9	1	7	8	6	4	5	3
7	5	8	6	1	9	2	3	4
4	2	6	5	3	8	1	7	9
1	3	9	2	4	7	5	8	6
8	4	5	3	6	1	7	9	2
6	1	2	9	7	5	3	4	8
9	7	3	8	2	4	6	1	5

A B C D E F 1 2 3







ఊరి చుట్టూ ప్రహరీ!



ఊరి పొలిమేరలో అడుగుపెట్టకముందే ఇళ్ల వరుసలూ, వీధుల్లాంటివన్నీ కనిపిస్తాయి ఎక్కడైనా. కానీ చైనాలోని 'యూంగ్‌టై' గ్రామాన్ని మాత్రం లోపలికి వెళితేనే చూడగలం. ఎందుకంటే చుట్టూ ఎత్తయిన ప్రహరీతో నాలుగు మహా ద్వారాలతో ఉంటుంది అది. ఇంచుమించు నాలుగు వందల సంవత్సరాల క్రితమే ఇలా కట్టుదిట్టమైన రక్షణ ఏర్పాట్లు చేసుకున్నారు ఈ ఊరి ప్రజలు. ఇతరులు ఊళ్లోకి ప్రవేశించకుండా ఉండాలనే- ఈ వినూత్నమైన ఆలోచన చేశారట. ఊరు మొత్తం తాబేలును పోలి ఉండటంతో దీన్ని 'టర్టిల్ విలేజ్' అని కూడా పిలుస్తుంటారు. నిర్మాణంలో వైవిధ్యం కలిగి- అలనాటి సంప్రదాయాల్ని అనుసరించే ఈ ఊరినీ, ఇక్కడి ప్రజల్నీ చూడ్డానికి ఎక్కడెక్కడి నుంచో పర్యటకులు వస్తుంటారు. ఒకప్పుడు వందలాది కుటుంబాలతో ఉండే ఈ ఊరి జనాభా ప్రస్తుతం నాలుగు వందలు ఉంటుంది. ప్రాచీన శైలిలోని ఈ గ్రామంలో సినిమా షూటింగ్‌లూ జరుగుతుంటాయట. ఏది ఏమైనా, ఆనాటి ఈ 'గేటెడ్ కమ్యూనిటీ విలేజ్' ఓ అద్భుతమే అని చెప్పాలి!





జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్‌లో ప్రయాణమంటే సాహసికులు ఎగిరి గంతేస్తారు. ఎందుకంటే, ఎత్తయిన కొండల ఆ అడవిదారులు ఎన్నెన్నో మలుపులతో ఎంతటి అనుభూతిని అందిస్తాయో మాటల్లో వర్ణించలేం! పచ్చటి చెట్ల నడుమ కొండను చుడుతూ సాగే ఈ ఫొటోలోని దృశ్యం ఆ దారుల్లోని ఓ మలుపే! ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాలకు కారణమయ్యే ఈ రోడ్ల మీద బండిని పరుగులు తీయించాలనే ఉత్సాహంతో కార్లూ, జీపుల్లో బయలుదేరి వస్తారు చాలామంది. ప్రకృతి అందాల్ని ఎంజాయ్ చేస్తూ 'సాహసం శ్వాసగా సాగిపో' అంటూ దూసుకుపోతారు!



